నేటి నుంచి తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు4: ఖమ్మం జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో నేటినుంచి ప్రతి సోమవరం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు దరఖాస్తులను తమ మండల పరిధిలోని తహసీల్దార్ కార్యాలయాల్లోనే అందించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తన ప్రకటనలో తెలిపారు.



పట్టాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాద్రి రామయ్యకు ఘనంగా పట్టాభిషేకం


- స్వామి వారికి ఘనంగా నిత్య కల్యాణం


భద్రాచలం, ఆగస్టు 4: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామికి ఆదివారం ఘనంగా పట్టాభిషేం నిర్వహించారు. ప్రతినెల పుష్యమి నక్షత్రం రోజున స్వామి వారికి పట్టాభిషేకం నిర్వహించడం అనాధిగా వస్తున్న సంప్రదాయం. అందులో భాగంగా తొలుత స్వామివారికి నిత్య కల్యాణం నిర్వహించి అనంతరం పట్టాభిషేక కార్యక్రమం నిర్వహించారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, కలశావాహన చేశారు. శ్రీమద్రారామాయణంలో పట్టాభిషేక ఘట్టాన్ని దేవస్థానం రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు వివరించారు. తరువాత కిరీట దారణ, ప్రోక్షణ, ప్రత్యేక ప్రసాద నివేదన చేసి భక్తులకు ప్రసాద పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, ఉప ప్రధాన అర్చకులు అమరవాద శ్రీనివాస రామానుజం పాల్గొన్నారు.

ఖమ్మంలో రంగస్థల సౌరభం..

- 9నుంచి ఉభయరాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు
- మూడు రోజుల పాటు నిర్వహణ
- ప్రారంభించనున్న మంత్రి తుమ్మల
- పాల్గొననున్న మంత్రి పొంగులేటి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

6





ఆయిల్‌పామ్‌తో ఉజ్వల భవిష్యత్

- రాష్ట్రంలో విస్తరణకు అనుకూల వాతావరణం

- ప్రస్తుతం దేశీయ అవసరాలకోసం రూ.80వేల కోట్ల ఆయిల్ దిగుమతి
- రాయితీపై మొక్కలు, ఎరువులు, డ్రిప్‌ల సరఫరా
- మొక్క దశనుంచి క్రష్షింగ్ వరకు కర్మాగారాలదే బాధ్యత
- ధర నిర్ణయం ప్రభుత్వ ఆధ్వర్యంలోనే..
- త్వరలో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలోనే నూనెశుద్ధి కర్మాగారాలు
- పామాయిల్ రైతులకు బ్యాంకుల సహకారం

ప్రస్తుతం దేశంలో వినియోగించే నూనెల్లో సుమారు రూ.80వేల కోట్ల విలువైన నూనెలు విదేశాల నుంచే దిగుమతి అవుతున్నాయి. దాంతో ఎంతో విలువైన విదేశీ మారకద్రవ్యాన్ని నూనెలు దిగుమతికోసం ప్రభుత్వం ఖర్చు చేయాల్సి వస్తోంది. దిగుమతి అవుతున్న నూనెల్లో సుమారు రూ.11వేల కోట్లు కేవలం పామాయిల్‌కే చెల్లించాల్సి వస్తోంది ఈ నేపథ్యంలో దేశీయంగా నూనె ఉత్తత్తులను అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. అందులో భాగంగా రాష్టరంలో ఆయిల్‌పామ్ విస్తరణకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఏపీ, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, కేరళ, ఒడిశా, గుజరాజ్, మిజోరాం, అస్సాం, మణిపూర్, నాగాలాండ్‌లలో ఆయిల్‌పామ్ తోటలు వేయటానికి అనూకూలమైన వాతావరణం ఉంది. దేశం మొత్తం మీద ఏపీ, తెలంగాణాలోనే అత్యధిక పామాయిల్ విస్తీర్ణం ఉంది. తెలంగాణలో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఇప్పటికే 1,28,000 ఎకరాల్లో పామాయిల్ తోటలు విస్తరించి ఉన్నాయి. అందులో ఒక్క భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 60వేలు, ఖమ్మం జిల్లాలో 28వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోంది. గత కొద్ది సవంత్సరాలుగా మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి, జనగాం, సిద్దిపేట, గద్వాల్, నారాయణపేట జిల్లాలో తోటలు విస్తరిస్తున్నాయి. వీటితో పాటు రాష్ట్రంలోని 31 జిల్లాల్లో పామాయిల్ తోటల విస్తరణ బాధ్యతలను ప్రభుత్వం పలు ప్రైవేటు కంపెనీలకు అప్పగించింది.

అశ్వారావుపేట, ఆగస్టు 4: రాష్ట్రంలో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో విత్తనాలను తెప్పించి మొక్కలను పెంచడం వాటిని సరఫరా చేయడం, చివరికి పంట చేతికొచ్చిన తరువాత గెలల కొనుగోలు, వాటి ధర నిర్ణయం చేస్తారు. ఆయిల్‌పామ్ విత్తనాలను ఇండోనేషియా, మలేషియా, కోస్టారికా, థాయిలాండ్ వంటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటారు. ఆ విత్తనాలతో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో నిపుణులైన ఉద్యానశాఖ అధికారుల పర్యవేక్షణలో 11 నెలలపాటు మొక్కలను పెంచుతారు. ఆ తరువాత మొక్కల నాణ్యతను పరిశీలించి సంబంధిత అధికారుల ధృవీకరణతో రైతులకు సరఫరా చేస్తారు. ఒక్కో మొక్క తయారీకి రూ.213 వరకు ఖర్చవుతున్నా ఉద్యానశాఖ ఒక్కో మొక్కకు రూ.213 రాయితీని ఇచ్చి రైతులకు ఒక్కో మొక్క కేవలం రూ.20లకు మాత్రమే అందజేస్తుంది. తోట వేసిన తరువాత సంవత్సరానికి ఎకరానికి రూ.4,200 చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ఎరువులు, ఇతర అవసరాలకోసం రైతులకు ఉద్యానశాఖ అందజేస్తుంది. డ్రిప్ సౌకర్యం కోసం ఒక్కో యూనిట్‌ను రూ.54వేలు ఖర్చవుతుండగా ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, బీసీలకు 90శాతం, ఓసీలకు 80శాతం రాయితీపై అందజేస్తారు. తోటల్లో అంతర పంటలు వేసుకునేందుకు ప్రోత్సాహకాలూ అందిస్తారు. బ్యాంకులు ఆయిల్‌ఫెడ్ టైఅప్‌తో రైతులకు రుణాలు ఇస్తాయి.

ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ధర నిర్ణయం

ఆయిల్‌పామ్ గెలలకు ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ధరలు నిర్ణయిస్తారు. ముఖ్యంగా ప్రభుత్వం రంగ సంస్థ అయిన ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలోని కర్మాగారాల్లో వచ్చే ఆయిల్ రికవరీశాతాన్ని అనుసరించే గెలల ధరను నిర్ణయిస్తారు. ఈ ధరనే ఇతర కంపెనీలు అనుసరించాల్సి ఉంటుంది. రాష్ట్ర ఉద్యానశాఖ, ఆయిల్‌ఫెడ్, రైతు సంఘ ప్రతినిధులు సంయుక్తంగా ఏటా ఆయిల్‌పామ్ గెలల ధరలను నిర్ణయిస్తారు. అయితే అంతర్జాతీయ మార్కెట్, కేంద్రం విధించే దిగుమతి సుంకాలు వంటి వాటిపై ఆధారపడి ధరల్లో మార్పు ఉంటుంది.

కొనుగోళ్లు, రవాణా చార్జీలు కర్మాగారాలదే...

తోటల నుంచి వచ్చిన గెలల కొనుగోళ్ల బాధ్యత పూర్తిగా ఆయిల్‌ఫెడ్‌దే. సాధారణంగా ఆయిల్‌పామ్ గెలలు చెట్టునుంచి దింపిన తరువాత 48గంటల్లో క్రషింగ్ చేస్తేనే తగిన శాతంలో ఆయిల్ రికవరీ వస్తుంది. దీంతో ఆయిల్‌ఫెడ్ ఎక్కడికక్కడ కర్మాగారాలు నిర్మించింది. దూర ప్రాంతంలో ఉన్న గెలలను కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సేకరిస్తారు. గెలలను ఫ్యాక్టరీలకు తరలించేందుకు రవాణా చార్జీలను సైతం కర్మాగారాలే భరిస్తాయి.

అశ్వారావుపేట, అప్పారావుపేటలో కర్మాగారాలు..

రాష్ట్రంలో ఇప్పటి వరకు భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోనే ఆయిల్‌పామ్ తోటలు ఎక్కువగా విస్తరించి ఉండడడంతో క్రషింగ్ కోసం అశ్వారావుపేట, దమ్మపేట మండలం అప్పారావుపేటల్లో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ కర్మాగారాలను నిర్మించారు. అశ్వారావుపేటలో ఇప్పటికే గంటకు 30 టన్నుల గెలలు క్రషింగ్ సామర్థ్యంతో ఆయిల్‌పామ్ కర్మాగారాన్ని నిర్మించారు. దీనికి అనుబంధంగా రూ.33కోట్లతో సెల్ఫ్‌పవర్ ప్లాంటేషన్‌ను సిద్ధం చేస్తున్నారు. దమ్మపేట మండలం అప్పారావుపేటలో 90 టన్నుల క్రషింగ్ సామర్థ్యంతో మరో కర్మాగారాన్ని నిర్మించారు. ప్రస్తుతం ఈ రెండు కర్మాగారాల ద్వారా ఏడాదికి సుమారు 52వేల టన్నుల క్రూడాయిల్ ఉత్పత్తి అవుతోంది. ఈ క్రూడాయిల్‌ను కాకినాడ, హైదరాబాద్, జంగారెడ్డిగూడెంలలోని పలు ప్రైవేటు కంపెనీలు కొనుగోలు చేస్తాయి. ఆయా కంపెనీలు శుద్ధి చేసిన నూనెలో కొంతభాగాన్ని ఆయిల్‌ఫెడ్ తిరిగి కొనుగోలు చేసి 'విజయ' బ్రాండ్ పేరుతో మార్కెట్‌లో పామాయిల్‌ను విక్రయిస్తుంది. త్వరలో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలోనే నూనెశుద్ధి కర్మాగారాలను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

రైతులు, కర్మాగారాలకు నిష్పత్తి పద్ధతిన పంపకాలు..

ఈ ఏడాది ఆయిల్ రికవరీ శాతాన్ని 19.22శాతంగా ప్రభుత్వం గుర్తించింది. (రికవరీశాతం అంటే 100 కేజీల గెలలను క్రషింగ్ చేస్తే 19.22 గ్రాముల నూనె వస్తుంది.) ఇందులో రైతులకు 75.25శాతం, కర్మాగారానికి 24.75శాతం వాటా దక్కుతుంది. ఈ నిష్పత్తి ప్రకారం ఉత్పత్తి అయిన నూనెలో రైతులు, కర్మాగారాలకు వాటాలు లభిస్తాయి.

సగటున ఎకరానికి 10టన్నుల దిగుబడులు..

ఒక ఏడాదికి ఎకరానికి సగటున 10 టన్నుల దిగుబడి వస్తుంది. టన్ను గెలల ధర ఈనెలలో రూ.13,828లుగా ఉంది. ఈ ధర ప్రకారం చూస్తే ఎకరానికి రూ.1,38,000లకు పైగా ఆదాయం లభిస్తుంది. రైతుల నుంచి కొనుగోలు చేసిన గెలలకు ఆయిల్‌ఫెడ్ వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తుంది.

ఎల్లప్పుడూ ఆయిల్‌పామ్‌కు డిమాండ్

దేశంలో వినియోగించే నూనె నిల్వల్లో భారీ లోటు ఉంది. దీంతో విదేశాలనుంచి భారీగా దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. వినియోగానికి, దిగుబడులకు చాలా తేడా ఉండటంతో నూనెకు ఎప్పుడు డిమాండ్ ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అన్ని రకాల రాయితీలు ఇస్తుండడంతో రైతులు పామాయిల్ తోటలు వేసేందుకు ఆసక్తిని చూపుతున్నారు. ఎకరానికి ఏడాదికి రూ.లక్ష నికర ఆదాయం వస్తుంది. ఒక్కసారి తోట వేస్తే సుదీర్ఘకాలం దిగుబడులు వస్తూనే ఉంటాయి. బ్యాంకులు కూడా ఆయిల్‌పామ్ రైతులకు రుణాలు ఇస్తున్నాయి.

ఆకుల బాలకృష్ణ, ఆయిల్‌ఫెడ్ డివిజన్ అధికారి

సరిదిద్దకుంటే అప్రతిష్టే

- కల్లూరు డొంక అభివృద్ధితో నేరుగా వ్యవసాయ మార్కెట్‌కు రహదారి
- తొలగని ఖానాపురం అలుగు ఆక్రమణలు
- అవినీతికి కేరాఫ్‌గా లేఅవుట్ అనుమతులు
- పాలకవర్గానికి మించి అధికార యంత్రాంగం నిర్ణయాలు
- విలీన, శివారు ప్రాంతాల్లో సమస్యల తిష్ట
- నేడు నగరపాలక సంస్థ పాలకవర్గ సమావేశం
- హాజరుకానున్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 4: చైతన్యవంతమైన ప్రజలు ఉన్న ఖమ్మంలో ప్రజా సమస్యలు పరిష్కారం నుంచి అభివృద్ధి వరకు హైదరాబాద్‌కు మించిన స్థాయిలో ముందుండాలనేది ప్రజల ఆకాంక్షగా ఉంటుంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వాలు సైతం పలు పైలెట్ ప్రాజెక్టులను ఖమ్మంలో అమలు చేసేందుకు ముందుకు వస్తుంటాయి. అయితే గత కొన్నేళ్లుగా ఖమ్మం నగర పాలక సంస్థ ఒక వైపు అభివృద్ధిలో ముందుంటూనే మరో వైపు పలు అప్రతిష్టలను మూటగట్టుకొంటుంది. ప్రజలు ఎన్నుకున్న పాలకవర్గం ఉన్నా ప్రజాప్రతినిధుల సూచనలు మేరకు పనిచేయాల్సిన అధికార యంత్రాంగం పాలకవర్గానికి మించిన స్థాయిలో నిర్ణయాలు తీసుకోవటం వివాదాలకు, అవినీతి ఆరోపణలకు కారణమవుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం నిర్వహించనున్న ఖమ్మం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

కౌన్సిల్‌లో గుర్తించాల్సిన సమస్యలివే...

ఖమ్మం నగరంలో ఖానాపురం చెరువుకు ఎంతో చరిత్ర ఉంది. అలాంటి ఈ చెరువు అలుగు ఆక్రమణకు గురికావటంతో గత ప్రభుత్వం ప్రజాఆగ్రహాన్ని ఎదుర్కొంది. చెరువు నుంచి అలుగు ద్వారా వెళ్లాల్సిన నీటికి ఇబ్బందులు ఎదురై నివాసాల్లోకి వరద చేరుతోంది. అలుగు ఆక్రమణలపై బహిరంగంగానే విమర్శలు వెలువడుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. ఈ అక్రమణలు తొలగించి ఖానాపురం చెరువుకిను మరో లకారం ట్యాంక్ బండ్‌గా మార్చాల్సిన అవసరం ఉంది.

● గొల్లగూడెం రోడ్డు నుంచి వెలుగుమట్ల, వీవీ పాలెం వరకు దశాబ్దాల చరిత్ర కలిగిన పురాతనమైన కల్లూరు డొంక రహదారి ఉంది. దాన్ని రహదారిగా మార్చితే వీవీ.పాలెం నుంచి నేరుగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రైతుల వాహనాలు వచ్చేందుకు అవకాశం ఉంది. దాంతో ఖమ్మం ప్రధాన రహదారిలో వాహనాల రద్దీ తగ్గుతుంది.



● గత ప్రభుత్వ హయాంలో మూడు రోజుల్లోనే లేఅవుట్ అనుమతులు ఇస్తామని ప్రకటించారు. కానీ ఏడాది పూర్తయినా అనుమతి రావాడం లేదు. ఈలోపు అమ్మకాలు, కొనుగోలు చేసిన వారి మధ్య భూ వివాదాలు ఏర్పడుతున్నారు. ముందుగా లేఅవుట్ అనుమతి పొందాలంటే ఒక్కో పర్మిషన్‌కు రూ.5లక్షల వరకు వసూళ్లు చేస్తున్నారని విమర్శలు వెలువడుతున్నాయి. ఈ క్రమంలోనే కేఎంసీకి అవినీతి ప్లానింగ్‌గా అపవాదును మూటగట్టుకుంది.

● డంపింగ్ యార్డుకు వెళ్లే రహదారి సరిగా లేకపోవటంతో రోజుకు రెండు ట్రిప్పులు తిరగాల్సిన ట్రాక్టర్లు, గుంతల రహదారుల్లో ఒకే ట్రిప్ వేస్తున్నారు. దీంతో వర్షాకాలంలో నగరంలో రహదారుల వెంట చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్గంధం వ్యాప్తి చెంది, దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి.

● 2021లెక్కల మేరకు ఖమ్మంలో 5 వేల కుక్కలు ఉండగా వాటికి యానిమల్ బర్త కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ఒక్కో కుక్కకు రూ.2వేలు ఖర్చు చేసి అపరేషన్లు చేశారు. మూడేళ్లలో ఏబీసీ అధికారులు మాత్రం తాము 7వేల కుక్కలకు శస్త్రచికిత్సలు చేశామని చెబుతున్నారు.

(మిగతా 6వ పేజీలో)



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపాలనలో విద్య, వైద్యానికి పెద్దపీట

వివరాలు : 6లో

- రాష్ట్రంలో రైతును రాజును చేస్తాం..
- రూ.31వేల కోట్ల రుణమాఫీ చేశాం
- ధరణిని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తున్నాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



నాయకన్‌గూడె వద్ద పాలేరు జలాశయంలోకి చేరుతున్న సాగర్ జలాలు

పాలేరు జలాశయానికి చేరిన సాగర్ జలాలు

- నేడు రెండోజోన్ ఆయకట్టుకు నీటి విడుదల
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఇరిగేషన్ అధికారులు

వివరాలు : 6లో

తినలేక.. ఉండలేక

- భద్రాద్రి జిల్లాలో ఏకైక క్రీడల పాఠశాల దుస్థితి

వివరాలు : 7లో

'సన్న రకాల'పై అన్నదాత నజర్

- ప్రభుత్వం వరికి బోనస్ ప్రకటించడంతో ఆ దిశగా ఆలోచన
- ఇప్పటికే జిల్లాలో సాగైన విస్తీర్ణంలో 30శాతం సన్న రకాలే..



ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 4: ప్రభుత్వం వరిరైతులకు బోనస్ ప్రకటించడంతో జిల్లా రైతులు సన్నరకాల సాగుపై దృష్టి సారిచారు. ఇప్పటికే మార్కెట్లో సన్న రకం బియ్యానికి మంచి ధర పలుకుతుండటంతో పాటు ప్రభుత్వం క్వింటాకు రూ.500బోనస్ ప్రకటించడంతో చాలామంది రైతులు సన్నరకాల సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటి వరకు వర్షాలు ఆశాజనకంగా లేకపోయినా ఎన్నెస్పీ ఆయకట్టుకు నీరువస్తుండడంతో రైతులు సన్నాలవైపు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే బోర్లు, బావులు ఉన్నచోట రైతులు నాట్లు పూర్తి చేశారు. వరినాట్లకు ఈ నెలాఖరు వరకు సమయం ఉండటం, వర్షాలు సమృద్ధిగా కురుస్తాయనే ఆశతో అన్నదాతలు ఉన్నారు. దాంతో వరి సన్నరకాల సాగు పెరిగే అవకాశం ఉంది. జిల్లాలో ఏటా వానాకాలం సీజన్లో సుమారు 2.83లక్షలకు పైగా ఎకరాల్లో వరి సాగవుతోంది. ఈ ఏడాది ఇప్పటికే సుమారు 40వేల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. ఈసారి వరిసాగు అంచనాకు మించి ఉండవచ్చని వ్యవసాయశాఖ భావిస్తోంది. ఇప్పటికే నాట్లు పూర్తయిన వాటిలో 30 శాతానికి పైగా సన్న రకాలు ఉన్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. దొడ్డు రకాల సాగుకు సన్నరకాలతో పోల్చితే ఖర్చు తక్కువగా ఉంటుంది. దొడ్డు రకాలకు ఎకరాకు రూ.22వేల వరకు పెట్టుబడి అవుతుండగా 25-28 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. సుమారు రూ.58 వేల ఆదాయం వస్తుంది. ఇదే సన్న రకాలు సాగు చేస్తే పెట్టుబడి ఖర్చులు రూ.30 వేలు అవుతుండగా 22-23 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ధాన్యాన్ని మార్కెట్లో విక్రయిస్తే రూ.61వేలు వస్తుండగా.. బియ్యంగా మార్చి విక్రయిస్తే క్వింటాలుకు రూ.5వేల ధర పలికితే రూ.75వేలగా ఆదాయం సమకూరుతుంది.

15న వైరాకు సీఎం రేవంత్‌రెడ్డి

- బహిరంగ సభ, పార్కింగ్ స్థలాలను పరిశీలించిన అధికారులు, డీసీసీ అధ్యక్షుడు



బహిరంగ సభ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

వైరా, ఆగస్టు 4: సీతారామ ప్రాజెక్టు మోటార్ల ప్రారంభోత్సవానికి 15వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు విచ్చేయనున్నారు. ఈ నేపథ్యంలో వైరాలో బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. దాంతో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సూచనలతో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా, స్థానిక ఆర్‌అండ్‌బీ, పోలీసుశాఖ అధికారులు రేవంత్‌రెడ్డి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై ఆదివారం సమీక్షించారు. 15వ తేదీన దుమ్ముగూడెం వద్ద సీతారామ ప్రాజెక్టు మోటర్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆన్‌చేసి ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా వైరాలో జరిగే బహిరంగ సభలో సీఎం పాల్గొంటారని వైరా ఎమ్మెల్యే అధికారులకు, కాంగ్రెస్ నాయకులకు సమాచారం అందించారు. సీతారామ ప్రాజెక్టు మోటర్లను ముఖ్యమంత్రి ప్రారంభిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా ఇటీవలే ప్రకటించారు. మోటార్లను ప్రారంభించిన తరువాత గోదావరి జలాలను లింక్‌కెనాల్ ద్వారా వైరా రిజర్వాయర్‌కు తరలించేందుకు చేస్తున్న నిర్మాణాలను ముఖ్యమంత్రి పరిశీలించి అనంతరం వైరాలో నిర్వహించే భారీ బహిరంగ సభలో పాల్గొంటారని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా ముఖ్యమంత్రి పర్యటనపై దృష్టిసారించారు. బహిరంగ సభ, పార్కింగ్ కోసం వైరాలో రెండు, మూడుచోట్ల ఖాళీస్థలాలను పరిశీలించారు. తుళ్లూరి కోటేశ్వరరావు పామాయిల్‌తోట సమీపంలోని స్థలం బహిరంగ సభకు అనుకూలంగా ఉంటుందని అధికారులు ఒక నిర్ధారణకు వచ్చారు. వైరా ఏసీపీ ఎంఏ.రెహ్మాన్, సీఐ ఎన్.సాగర్, ఆర్‌అండ్‌బీ ఖమ్మం ఎస్ఈ హేమలత, వైరా డీఈ ఎం.రమేష్, ఏఈ విశ్వనాథం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకులు పుచ్చకాయల వీరభద్రం, పణితి శ్రీను, పమ్మి అశోక్ పాల్గొన్నారు.

లక్ష్మీదేవికి ప్రీతికరం శ్రావణమాసం

» భద్రాద్రి దేవస్థానంలో ఈ మాసంలో ప్రత్యేక పూజలు » 30న లక్ష్మీతాయారు అమ్మవారికి పుష్పాంజలి

భద్రాచలం, ఆగస్టు 4: శ్రావణమాసం లక్ష్మీదేవికి అత్యంత ప్రీతికరమైన మాసం. ఈమాసంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం దీపారాదన చేయడం వలన దీర్ఘ సుమంగళి ప్రాప్తంతో పాటు అష్టైశ్వర్యాలు సమకూరుతాయని ఆధ్యాత్మికవేత్తలు పేర్కొంటున్నారు. తిధులతో సంబంధం లేకుండా అష్టమి, నవమి, అమావాస్య రోజుల్లో కూడా పండుగలు, పూజలు చేసే అత్యంత శుభప్రదమైన మాసం శ్రావణమాసమే అంటున్నారు. వాస్తవానికి శ్రావణమాసం అంటే శుభమాసమని అంటారు. ఈ నెలలో వచ్చే సోమ, మంగళ, శుక్ర శనివారాలు ఎంతో పవిత్రమైనవని, అలాగే ఈ నెలలో వచ్చే జంద్యాల పౌర్ణమి, కృష్ణాష్టమి, పొలాల అమావాస్య, నాగచతుర్ద, నాగ పంచమి, దామోదర ద్వాదశి, వరాహ జయంతి, లాంటి ముఖ్యమైన పండుగలు.

శ్రావణమాసం చంద్రునిమాసం కూడా. చంద్రుడు మనఃకారకుడు. అంటే సంపూర్ణంగా మనసుమీద ప్రభావం చూపే మాసం ఈ. మాసంలో రవి సంచరిస్తూ నక్షత్రాల ప్రభావం చంద్రుని మూలంగా మన మీద ప్రభావం చూపుతుంది. చంద్రగమనం వలన జరగబోయే దుష్పరిణామాలు నివారించడానికి మంచి జరగడానికి ధర్మాచరణాలను పండుగగా ఆచరించడం నియమంగా పెట్టారు. అదేవిధంగా మానసిక శాంతి, మంచి ఆరోగ్యాన్ని పొందేందుకు శ్రావణమాసంలో నిర్దేశించిన ఆచారాలను పాటించడం ఎంతో అవసరమని ఆధ్యాత్మికవేత్తలు పేర్కొంటున్నారు.



రామాలయంలో శ్రావణమాసోత్సవాలు ఇవే

9న తొలి శుక్రవారం కావడంతో శ్రీ లక్ష్మీ అమ్మవారికి స్నపన తిరుమంజనం సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నారు. 7న ఆండాళ్లమ్మవారి తిరునక్షత్రం అమ్మవారికి అభిషేకం, రాత్రి చుట్టు సేవ, విశేష బోగ నివేదన, 10న చిత్తా నక్షత్రం సందర్భంగా సుదర్శన హోమం, 16న వరలక్ష్మి వ్రతం, సామూహిక సహస్రనామకుంకుమార్చన, సంధ్యాహారతి నిర్వహించనున్నారు. 30న శ్రీ లక్ష్మీ అమ్మవారికి పుష్పాంజలి సేవ(సామూహిక అర్చన) చేయనున్నారు. ఇదిలా ఉండగా 3, 4 శుక్రవారాల్లో సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ కరువు

» నాణ్యత లేని సరుకులు, మురుగిన గుడ్లు సరఫరా
» సమయానికి తెరుచుకోని కేంద్రాలు
» ఇబ్బందులు పడుతున్న చిన్నారులు, లబ్ధిదారులు
» పట్టించుకోని అధికారులు

ఖమ్మం ఖానాపురంహవేలి ఆగస్టు 3: జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలపై మహిళ శిశు సంక్షేమశాఖ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందనే విమర్శలు వినపడుతున్నాయి. సూపర్వైజర్లు, సీడీపీవోల మధ్య సమన్వయం లోపించి అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ గురించి పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల మధిర మండల కేంద్రంలోని కుళ్లిపోయిన కోడిగుడ్లు రాగా లబ్ధిదారులు ముందుగా పర్శీలించటంతో ఎలాంటి ఇబ్బంది జరగలేదు. అదే చిన్నారులకు ఆ మురిగిన గుడ్లను పెడితే పరిస్థితి ఎలా ఉంటుందో తెలియని కాదు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు, కోడిగుడ్లు సరఫరా చేసే వ్యాపారులకు సంబంధిత అధికారులకు సమన్వయం ఉండటంతోనే వారిపై ఎలాంటి చర్యలకు ముందుకు రావటంలేదనే విమర్శలు వినపడుతున్నాయి. ఎలాంటి సరుకులు ఇచ్చినా ఓకే చెబుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యత లేని సరుకులు, కోడిగుడ్లు వస్తున్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు సరఫరా చేయకుండా మిగిలి ఉన్న సరుకులను పక్కదారి పట్టిస్తున్నారనే వాదనలు వినపడుతున్నాయి. జిల్లాలోని మారుమూల సెంటర్ల నుంచి సరుకులను కిరాణం షాపులకు తరలిస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. కోడిగుడ్లు, పప్పులు, ఇతర వస్తువులను పక్కదారి పడుతున్నట్లుగా తెలుస్తోంది. బారీ వర్షాలు కురుస్తే అంగన్వాడీ కేంద్రంలోకి నీరు చేరి అబ్దిదారులు ఇబ్బందులు పడుతున్న అటువైపు సంభందిత ఐసీడీఎస్ అధికారులు పట్టించుకునే నాదుడు లేడనే వాదనలు వినపడుతున్నాయి. పలు ప్రాజెక్టు పరిధిలోని సెక్టార్లులో కోడిగుడ్లు కిరాణం షాపుల్లో దర్శనమిస్తున్నా చర్యలు తీసుకోవటంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నరే తప్ప చర్యలు మాత్రం తీసుకోలేదు. ఇలా ప్రతి ప్రాజెక్టులో అంగన్‌వాడీ కేంద్రాల సరుకులు పక్కదారి పడుతున్నా సంబంధిత పర్యవేక్షకులు చర్యలు తీసుకోవటంలో వెనకడుగు వేస్తున్నరనే విమర్శలు వినపడుతున్నాయి.



మురిగిన గుడ్లు

సమయం పాటించని కొందరు టీచర్లు

ఖమ్మం జిల్లాలో ఏడు ప్రాజెక్టు పరిధిలో మొత్తం 1840 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా అందులో 1780 మంది టీచర్లు విధులు నిర్వహిస్తున్నారు. వారిలో ఎక్కువ మంది సమయానికి కేంద్రాలను తెరిచి లబ్ధిదారులకు పౌష్టికాహారం అందిస్తుండగా కొందరు ఉదయం 10 గంటలకైనా అంగన్‌వాడీ కేంద్రాలకు రారు, కేంద్రాలను తెరవరు. దీంతో కేంద్రాలకు వచ్చే చిన్నారులు గంటల కొద్దీ కేంద్రాల వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని కొందరు చిన్నారుల తల్లితండ్రులు వాపోతున్నారు. వాస్తవానికి అంగన్‌వాడీ కేంద్రాలు ఉదయం 9 గంటలకే తెరిచి చిన్నారులను కేంద్రాలకు తీసుకురావాల్సి ఉంటుంది. కాని ప్రస్తుతం ఏ ఒక్క అంగన్‌వాడీ ఆయాకాని, టీచర్‌కాని లబ్ధిదారల ఇంటికెళ్ళీ లబ్ధిదారులను తీసుకురావటంలేదనే విమర్శలు వినపడుతున్నాయి. కేంద్రాలకు వచ్చిన వారికే పౌష్టికాహారం అందించి చేతులు దులుపుకుంటున్నారనే వాదనలు వినపడుతున్నాయి. ఖమ్మం జిల్లాలోని ఏడు ప్రాజెక్టు పరిధిలోని పలు సెక్టార్ల లో ఎక్కువగా అంగన్‌వాడీ కేంద్రాలు ఉదయం 10 గంటల తరువాతనే తెరుస్తున్నారు. దీంతో కూలీ పనులకు వెళ్ళే పేద కుటుంబాల చెందిన చిన్నారులు సమయానికి కేంద్రాలు తెరవకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారనే విమర్శలు వినపడుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షకులు కొందరు మధ్యాహ్నం వరకు సెంటర్ల తనిఖీలకు రాకపోవటం, కొందరు టీచర్ల చెప్పిందే సాయంత్రానికి ఆన్‌లైన్లో నమోదు చేయటం వంటి కార్యక్రమాలు చేపట్టటంతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణ అస్తవ్యస్తంగా మారిందని లబ్ధిదారులు వాపోతున్నారు.

తుమ్మలను కలిసిన పలువురు నాయకులు



తుమ్మలను కలిసి సత్కరిస్తున్న దృశ్యం

దమ్మపేట, ఆగస్టు 4: వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆయన స్వగ్రామం గండుగులపల్లిలో నివాసంలో ఆదివారం పలువురు కాంగ్రెస్ నాయకులు కలిశారు. దమ్మపేట, అశ్వారావుపేట, సత్తుపల్లి, ఖమ్మం మండలాలకు చెందిన పలువురు తుమ్మలను కలిసారు. ఈసందర్భంగా స్థానిక సమసల్యను తుమ్మల దృష్టికి తీసుకువెళ్ళారు. తుమ్మలను కలిసిన వారిలొ సొసైటి చైర్మన్ ఎల్లిన రాఘవరావు, దొడ్డా ప్రసాదు, కొయ్యల అచ్యుతరావు, కేవి సత్యనారాయణ, కాసాని నాగప్రసాదు, ఎర్రా వసంతరావు, మన్నెం అప్పారావు, డీసీసీబీ డైరెక్టర్ నిర్మల పుల్లారావు తదితరులున్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తజన సందోహం..

పాల్వంచ రూరల్, ఆగస్టు 4: మండలంలోని కేపీ జగన్నాధపురంలోని పెద్దమ్మతల్లి ఆలయం ఆషాడమాసం చివరి రోజున ఆదివారం భక్తజన సందోహంతో నిండింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు తగుసౌకర్యాలను దేవస్థానం అధికారులు కల్పించారు.



దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బైపాస్ రోడ్డు మరమ్మతులు చేపట్టండి

» సింగరేణి సీఎండీ బలరాంకి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని వినతి



కొత్తగూడెం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బొగ్గు రవాణా చేస్తున్న టిప్పర్ లారీలతో అధ్వానంగా మారిన ఇల్లెందు ఆర్అండ్‌బీ రోడ్లు కలిపే కారుకొండ - పోస్టాఫీస్ వరకు ఉన్న సింగరేణి రోడ్డును తక్షణమే పునః నిర్మించాలని అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టాలని సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాంను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. సింగరేణి భవన్‌లో ఆదివారం సీఎండీని కలిసి ఎమ్మెల్యే కూనంనేని వినతిపత్రం అందించి సమస్యను వివరించారు. ఆయన మాట్లాడుతూ నిత్యం వందలాదిగా బొగ్గు టిప్పర్లు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డు ధ్వంసమై ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ప్రధానంగా కోర్టు నుంచి హేమచంద్రాపురం క్రాస్ రోడ్డు వరకు గుంతలు ఏర్పడి రాకపోకలకు అంతారయం కలుగుతోందని తెలిపారు. తన ప్రతిపాదనపై సీఎండి సానుకూలంగా స్పందంచారని, త్వరలో నిధులు మంజూరీ చేసి రోడ్డు పునఃనిర్మాణ పనులు చేపేట్టందుకు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

దమ్మపేట సెంటర్ - కుంటినాగులగూడెం రోడ్డు పనులు చేపట్టండి: ఎమ్మెల్యే

అధ్వానంగా మారిన పాల్వంచ దమ్మపేట సెంటరు నుంచిన కుంటినాగులగూడెం ప్రధాన రహదారి మరమ్మతులు, పునఃనిర్మాణ పనులు చేపట్టాని ఆర్అండ్‌బీ అధికారులను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదేశించారు. రోడ్డు ధ్వంసమై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, తరుచూ ప్రమాదాలు చోటుకుంటున్నాయని, ప్రజలు, వాహనదారుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని రోడ్డు పనులు చేపట్టాలని, పనుల నిర్వహణలో నిర్లక్ష్యం తగదన్నారు.

రూ. 1.36కోట్ల నిధులతో ఆసుపత్రి అభివృద్ధి, సౌకర్యాల కల్పనకు ఎమ్మెల్యే కృషి

కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యల శాశ్వత పరిష్కారానికి అడుగులు పడుతున్నాయి. ఆసుపత్రిపై ప్రత్యేక దృష్టి సారించిన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రత్యేక చొరవతో రూ.1.36 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు తక్షణమే పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ, మున్సిపల్‌శాఖ, వైద్యశాఖ అధికారులను ఆదివారం ఓ ప్రకటనలో ఆదేశించారు. ఆసుపత్రిలో విద్యుత్ సరఫరాకు సంబంధించిన మరమ్మతులకు రూ.38 లక్షలు కేటాయించారని, ఆసుపత్రి మరమ్మతులు, డయాలసిస్ కేంద్రం, ఆపరేషన్, ఐసీయూ గదుల పూర్తిస్థాయి మరమ్మతులు, సౌకర్యాల కల్పనకు రూ. 50లక్షలు, పారిశుధ్య సమస్య పరిష్కారా నికి డ్రైనేజీ నిర్మాణం, ఇతర మరమ్మతులకు రూ. 48లక్షలు మంజూరు కాగా ఈ నిధులతో తక్షణమే పనులు ప్రారంభం కానున్నాయి. ఆసుపత్రిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఆ ప్రకటనలో ఎమ్మెల్యే తెలిపారు.

గోదావరి స్వల్పంగా పెరిగి తగ్గుముఖం

భద్రాచలం, ఆగస్టు 4: భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం స్వల్పంగా పెరిగి తగ్గుముఖం పట్టనున్నట్లు సీడబ్ల్యుసీ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. శనివారం అర్ధరాత్రి 12 గంటలకు 34.6 అడుగులుండగా ఆదివారం ఉదయం 6 గంటలకు 35.8, 12 గంటలకు 36.8, సాయంత్రం 6 గంటలకు 37.3 అడుగులకు చేరింది. స్వల్పంగా పెరిగి అనంతరం నిలకడగా ఉండి తగ్గుముఖం పట్టనున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

సరిదిద్దకుంటే అప్రతిష్టే

(5వ పేజీ తరువాయి)

అయినా వాస్తవానికి 15వేలకు పైగానే కుక్కల నగరంలో సంచరిస్తున్నాయి. కుక్కల బెడత ఎక్కువగా ఉండటంతో పిల్లలు, మహిళలు, వృద్దులు బయటికి రావాలంటేనే భయపడుతున్నారు. నిత్యంఅనేకమందికుక్కకాటుతో ఆసుపత్రులకు పరుగులుపెడున్నారు.

● ఉమ్మడి రాష్ట్రం నుంచి సీనియర్ నేత తుమ్మల నాగేశ్వరరావు పలు దఫాల్లో ఆర్అండ్‌బీ మంత్రి పనిచేసిన సమయంలో జిల్లాలో రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన రహదారులు 20ఏళ్ల క్రితమే నిర్మించారు. కానీ ఇప్పుడు నగరంలోని రహదారుల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. ప్రధాన రహదారుల నుంచి అంతర్గత రహదారుల వరకు చాలాచోట్ల ధ్వంసమయ్యాయి. వాటికి మరమ్మతులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవటంతో పాలకవర్గం తలపట్టుకుంటోంది.

● ఖమ్మం మున్సిపాలిటీ నుంచి నగరపాలక సంస్థగా అభివృద్ధి చెందటానికి విలీన గ్రామాలు ఉపయోగపడ్డాయి. అయితే పదేళ్లుగా విలీన గ్రామాలు, శివారు ప్రాంతాల ప్రజలు రహదారులు, తాగునీరు, డ్రైనేజీ సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రధాన కూడళ్లపై రూ.కోట్ల వ్యయం చేస్తున్న అధికారులు, తమ ప్రాంతాలను పట్టించుకోవటం లేదని, తమ పట్ల వివక్ష చూపుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహంగా ఉన్నారు.

● హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్‌కు వీధి దీపాల నిర్వహణ బాధ్యతలు ఇవ్వటంతో ఒక్కసారి వీధి దీపం పోయిందంటే ఆరు నెలల వరకు అంధకారం తప్పటం లేదు. ఈ విషయంపై గత సమావేశంలో పలు తీర్మానాలు చేసినా అమలకు నోచుకోలేదు.

● కేఎంసీలో కొన్ని విభాగాల అధికారులు పాలకవర్గానికి మించిన స్థాయిలో సొంతంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. కౌన్సిల్ ఆమోదం లేకుండానే ఉద్యోగ నియామకాలు చేస్తున్నారు. రోజువారీ కూలీల్లో సూపర్‌వైజర్ క్యాడర్‌ను ఏర్పాటు చేశారు. ఎవ్వరికి ఇష్టం వచ్చిన రీతిలో వారు బయోమెట్రిక్ హాజరును అమలు చేస్తున్నారు.

ఇలాంటి అనేక సమస్యలపై నేడు నిర్వహించే పాలకసంస్థ కౌన్సిల్ సమావేశంలో చర్చించి పరిష్కారం చూపాలని నగర ప్రజలు కోరుతున్నారు.

ఖమ్మంలో రంగస్థల సౌరభం..

» 9నుంచి ఉభయరాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు

ఖమ్మంసాంస్కృతికం, ఆగస్టు 4: ఖమ్మం నగరంలో రంగస్థల సందడి నెలకొనబోతోంది. 9వ తేదీనుంచి 11 వరకు ఉభయ రాష్ట్రాలస్థాయి ఆహ్వానిత నాటిక పోటీలకు భక్త రామదాసు కళాక్షేత్రం వేదిక కానుంది. ప్రతిరోజు సాయంత్రం 6 గంటలనుంచి ఈ నాటికలు ప్రదర్శించనున్నారు. 'నెలనెల వెన్నెల' 7వ వార్షికోత్సం సందర్భంగా నెల నెల వెన్నెల, ఖమ్మం కళాపరిషత్, ప్రజానాట్యమండలి కళాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించనున్నారు. నెలనెల వెన్నెల పేరుతో గత 85 నెలలుగా భక్త రామదాసు కళాక్షేత్రంలో నాటిక ప్రదర్శనలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.. అంతరించి పోతున్న నాటక కళకు పూర్వ వైభవం తెచ్చేందుకు ఈ మూడు సంస్థలు ఉమ్మడిగా కార్యక్రమం నిర్వహిస్తున్నాయి. మరో వంక రెండు తెలుగు రాష్ట్రాల్లోని నాటక సమాజాలకు చెందిన కళాకారులు సైతం తమ నాటికలను ఖమ్మంలో ప్రదర్శించేందుకు ఆసక్తి చూపుతుంటారు. స్థానికంగా కళలను ఆదరిస్తుండటం, కళాకారులను ప్రోత్సహిస్తుండటంతో తెలుగు నాటకరంగ దృష్టిని ఖమ్మం ఆకర్షిస్తోంది.

ఈ పోటీల్లో రోజుకు మూడు చొప్పున మూడు రోజుల పాటు తొమ్మిది ఎంపిక చేసిన నాటికలను ప్రదర్శించనున్నారు. మొదటి రోజు కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారు. 10న రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, 11న ముగింపు సభలకు ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క హాజరు కానున్నారు. కాగా ఈ నాటిక పోటీల్లో పాల్గొనేందుకు ఇరు రాష్ట్రాలనుంచి సుమారు 180 మంది నటీనటులు, కళాకారులు ఈ పోటీలకు హాజరవుతున్నారు. నాటిక, నాటక కళా రంగాలకు ఆంధ్రప్రాంతం పెట్టింది పేరు కాగా తెలంగాణలో సైతం నాలుగైదు చోట్ల నాటక సంస్థలు ఉనికిలో ఉన్నాయి. స్థానిక కళాకారుల ప్రదర్శనతో పాటు ఆంధ్రా, తెలంగాణ ప్రాంతాల్లోని నాటక సమాజాలు ప్రదర్శించే నాటికల్లో అత్యుత్తమమైన వాటిని ఎంపిక చేసి ఖమ్మంలో జరిగే పోటీలకు ఆహ్వానించారు. నాటిక పోటీల నిర్వహణతో పాటు నాటక రంగంలో విశేష కృషి చేసిన సీనియర్ నాటక కళాకారులు తాటికొండాల నరసింహారావుకు, పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్‌కు స్తంభాద్రి పురస్కారాలు అందజేయనున్నారు.

నాటికల ప్రదర్శన ఇలా..

● 9వ తేదీన.. సాయంత్రం 6 గంటలకు వెలగలేరు థియేటర్స్, వెలగలేరు కళాకారులు 'రాత' నాటికను ప్రదర్శిస్తారు. దీనికి రచన, దర్శకతం పోలుదాస్ శ్రీనివాసరావు. రాత్రి 8 గంటలకు హైదరాబాద్ గోవాడ క్రియేషన్స్ కళాకారులు 'మూల్యం' నాటికను ప్రదర్శిస్తారు. దీనికి రచయిత సింహప్రసాద్ కాగా వెంకట్ గోవాడ దర్శకత్వం వహించారు. రాత్రి 9.30కి కళానికేతన్ వీరన్న పాలెం కళాకారులు 'రాజుగారి గోచీ' నాటిక ప్రదర్శిస్తారు. దీన్ని నారిపెద్ది శివ నారాయణ రచించగా చిట్టినేని సాయిబాబు దర్శకత్వం వహించారు.

● 10న సాయంత్రం 5.30 గంటలకు సిరిమువ్వ కల్చరల్స్ హైదరాబాద్ కళాకారులు 'దారుణం' నాటికను ప్రదర్శిస్తారు. దీనికి రచన, దర్శకత్వం పరమాత్ముని శివరాం, రాత్రి 8గంటలకు హైదరాబాద్ మిత్ర క్రియేషన్స్ కళాకారులు 'అందిన ఆకాశం' నాటికను ప్రదర్శిస్తారు. దీనికి రచన సాయిపద్మశేఖర్, దర్శకత్వం దేవబత్తుల జార్జి, పర్యవేక్షణ ఎస్ ఎం బాషా, రాత్రి 9.30కి చందాల కేశవదాసు కళాపరిషత్ ఖమ్మం కళాకారులు 'సంపద' నాటికను ప్రదర్శిస్తారు. రచన వైఎస్ కృష్ణేశ్వరరావు, దర్శకత్వం నిభానుపూడి సుబ్బరాజు..

● 11వ తేదీన సాయంత్రం 5.30కి అభినయ ఆర్ట్స్ గుంటూరు కళాకారులు 'ఇంద్రప్రస్థం' నాటికను ప్రదర్శిస్తారు. రచన శ్రీసిగ్న, దర్శకత్వం ఎన్ రవీందర్‌రెడ్డి, రాత్రి 7 గంటలకు నటీనట సమాఖ్య పాలకొల్లు కళాకారులు 'అనూహ్యం' నాటికను ప్రదర్శిస్తారు. రచన తాలాబత్తుల వెంకటేశ్వరరావు, దర్శకత్వం కత్తుల రమ్మోహనరావు, రాత్రి 8.30కి హైదరాబాద్ కళాంజలి కళాకారులు 'పాశం' నాటికను ప్రదర్శిస్తారు. దీన్ని గోవిందరాజుల నాగేశ్వరరావు రచించగా, కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించారు.

కాల్వలు ఇలా..
సాగునీరు పారేదెలా..?



పూడిక, చెత్తతో నిండి ఉన్న ఎడమకాల్వ లింగన్నపాలెం లింక్ కెనాల్, గరికపాడు కాల్వ

వైరా, ఆగస్టు 4: వైరా రిజర్వాయర్ కుడి, ఎడమకాల్వలకు తాత్కాలిక మరమ్మతులు కూడా లేకపోవడంతో అధ్వానంగా ఉన్నాయి. ఈనెల ఆరోతేదీన కాల్వలకు సాగునీరు విడుదల చేసేందుకు ఇప్పటికే నిర్ణయం జరిగింది. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ కుడి, ఎడమకాల్వ లకు నీరు విడుదల చేయనున్నారు. అయితే కుడికాల్వ చివర్లో పూడిక, చెత్తచెదారంతో కాల్వగట్లు బలహీనంగా ఉన్నాయి. ఇప్పటికే కొంతమేర తాత్కాలిక మరమ్మతులు చేసినప్పటికీ ఇంకా చేయాల్సిన మరమ్మతులు మిగిలిపోయి ఉన్నారు. ప్రధాన ఎడమకాల్వ పరిధిలో గరికపాడు, లింగన్నపాలెం లింక్ కెనాల్స్ పూర్తిగా చెత్తాచెదారం, పూడికతో నిండిపోయి ఉన్నాయి. గతంలో గైడ్‌వాల్స్ నిర్మించిన కాల్వల్లో కూడా అనేకచోట్ల పూడిక, చెత్త పేరు కుపోయి ఉంది. వాటిని కూడా తొలగించాల్సి ఉంది. ఈ తాత్కాలిక మరమ్మతులకు నిధుల కొరత ఉండటంతో అధికారులు తామేమీ చేయలేని స్థితిలో ఉన్నారు. ఈ కాల్వలకు నీరు విడుదల చేసినప్పటికీ అవి సక్రమంగా ఆయకట్టుకు సరఫరా అవుతాయా లేదా అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాలేరు చేరిన సాగర్ జలాలు

» నేడు రెండోజోన్ ఆయకట్టుకు నీటి విడుదల » ఏర్పాట్లు పూర్తి చేసిన ఇరిగేషన్ అధికారులు

కూసుమంచి, జూలై 20: సాగర్ జలాలు ఆదివారం అర్ధరాత్రి పాలేరు జలాశయాన్ని తాకాయి. కృష్ణా పరీవాహకప్రాంతంలో భారీ వర్షాలు కురియడంతో ప్రాజెక్టులన్నీ జలకళను సంతరించుకున్నాయి. ఈ క్రమంలో సాగర్ డ్యామ్‌నుంచి 1, 2 జోన్‌ల ఆయకట్టుకు ఇటీవల మంత్రులు నీటివిడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆదివారం అర్ధరాత్రి దాటాక సాగర్ జలాలు పాలేరు జలాశయానికి చేరాయి. డ్యామ్ నుంచి 5వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా పాలేరు జలాశయానికి ప్రస్తుతం 500 క్యూసెక్కుల నీరు చేరుతోంది. క్రమంగా ఇది మరింత పెరగనుంది. పాలేరు జలాశయానికి సాగర్ జలాలు చేరడంతో సోమవారం రెండోజోన్ ఆయకట్టుకు ఇరిగేషన్ అధికారులు నీరు విడుదల చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. దీంతో ఖమ్మంజిల్లాలో రెండోజోన్ ఆయకట్టు పరిధిలో 22 మండలాల్లో 2.55 లక్షల ఎకరాలకు వానాకాలం పంటకు నీరందనుంది. వరి సాగుకు నీరు విడుదల కానుండటంతో రైతుల మోముల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఇప్పటికే పాలేరు పాతకాల్వకు నీరు విడుదల చేయగా మరోపక్క భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా చెరువులు నింపుతున్నారు. పాలేరు జలాశయంలో 23 అడుగుల గరిష్ట నీటిమట్టానికి ప్రస్తుతం 16.5 అడుగులమేర నీరు ఉంది.

భద్రాద్రి డిపో నుంచి అధిక ఆదాయం సాధించాలి

● ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం పవిత్ర

భద్రాచలం ఆగస్టు 4: పవిత్ర శ్రావణ మాసంలో పెళ్లి ముహూర్తాలు ఎక్కువగా ఉన్నందున భద్రాచలం డిపో నుంచి పెళ్లి బస్సులు ఎక్కువగా బుక్ చేయాలనీ సూపర్‌వైజర్, సిబ్బందిని ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) పవిత్ర కోరారు. భద్రాచలం డిపోలో ఆదివారం జరిగిన సూపర్‌వైజర్ల సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ ఆర్ఎం మాట్లాడారు. జూలై నెలలో గోదావరి వరదల కారణంగా ఆదాయం కొంత మేర తగ్గిందని, ఈ నెలలో రాబోయే శ్రావణమాసం లో ముప్పై రోజుల్లో పదిహేను పెళ్లి ముహూర్తాలు ఉన్నందున రద్దీ ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ క్రమంలో రద్దీ కి అనుగుణంగా ఎక్కువ సంఖ్యలో బస్సు లని నడపాలని కోరారు. అలాగే ఎక్కువ సంఖ్య లో పెళ్లి బస్సు లను బుక్ చేయాలనీ సూచించారు. ఈ పెళ్లి బస్సు లకు ఎటువంటి డిపాజిట్ లేకుండా ప్రయాణించే దూరానికి మాత్రమే డబ్బులు చెల్లించాలన్నారు. కావున ప్రయాణికులు ఎక్కువ సంఖ్య లో ఆర్టీసీ బస్సు లని పెళ్లిళ్లకి బుక్ చేసుకోవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ మేనేజర్ గౌతమీ, మెకానికల్ ఫోర్ మెన్ చక్రవర్తి , సూపర్వైజర్ లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ ఆర్ఎం పవిత్ర

ప్రజాపాలనలో విద్య, వైద్యానికి పెద్దపీట

» దరఖాస్తు చేసుకున్న నెలలోనే సీఎంఆర్ఎఫ్ చెక్కులు
» రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి

నేలకొండపల్లి, ఆగస్టు 4: రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తోందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం, చెన్నారం గ్రామాల్లో ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి 140మంది లబ్ధిదారులకు రూ.35.36లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం గువ్వలగూడెంలో మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు శాఖమూరి రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విద్య, వైద్యానికి ప్రాధాన్యతను పెంచిందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు రూ.10లక్షల ఉచిత వైద్యాన్ని అందిస్తున్నామన్నారు. రైతును రాజును చేయటానికి కాంగ్రెస్ సర్కార్ చర్యలు తీసుకొంటోందని, అందులో భాగంగానే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఒకే విడతలో రైతుల రుణమాఫీని చేస్తున్నామన్నారు. కష్టమైనా రూ.31వేల కోట్ల రుణమాఫీని చేస్తున్నామన్నారు. ధరణి పోర్టల్ వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అసెంబ్లీ సాక్షిగా ఆనాటి ప్రభుత్వం ధరణిపై అబద్దాలతో కూడిన గొప్పలు చెప్పిందన్నారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీ మేరకు ధరణిని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తున్నామని తెలిపారు.

రూ.22వేల కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా 4లక్షల 50వేల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించబోతున్నామని తెలిపారు. పాలేరు తన సొంత నియోజకవర్గం కావడంతో ఇక్కడ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తానన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కాకముందే ఏం చేయట్లేదని ప్రతిపక్షాలు నిలదీస్తున్నాయని, ఏడు నెలల్లో మూడు నెలలు ఎన్నికల కోడ్‌తోనే పోయిందని, మిగిలిన కాలంలో చాలానే చేశామన్నారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్లనే రాష్ట్రంలో ఆత్మహత్యలు పెరిగాయన్నారు. 'కాంగ్రెస్ వచ్చింది.. కరువు వచ్చింది.. కరెంటు పోయింది' అన్న వారికి ధీటుగా జవాబు చెబుతూ కాంగ్రెస్ వచ్చాకనే పుష్కలంగా వర్షాలు కురుస్తున్నాయన్నారు. ప్రస్తుతం రాష్టరంలో కరెంటు కష్టాలు లేవన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు ముఖ్యంగా ఆడబడ్డలు, రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. మంచి పరిపాలన కావాలని ప్రజలు ఇందరమ్మ రాజ్యం తెచ్చుకున్నారని, ఇప్పుడే ఆడబిడ్డల మోముల్లో సంతోషం కనిపిస్తోందన్నారు. ఆడబిడ్డలు, రైతన్నల మోముల్లో సంతోషం చూడాలన్న లక్ష్యంతోనే రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ సర్కార్ పని చేస్తోందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. అనంతరం చెన్నారం గ్రామంలో జరిగిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయ్‌బాబు, క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, కొడాలి గోవిందరావు, నాయకులు శాఖమూరి రమేష్, ఎంపీపీ వజ్జా రమ్య, ఎంపీటీసీ వంగూరి ఉష, బొడ్డు బొందయ్య, వెన్నపూసల సీతారాములు, వేగినాటి లక్ష్మీనర్సయ్య, యడవల్లి సైదులు, కొర్లకుంట నాగేశ్వరరావు, చిట్టూరి అచ్చయ్య, గోళ్ళ శ్రీనివాసరావు, షేక్.ఖాజామియా, షేక్.మస్తాన్, చింతనిప్పు సైదులు, రాయపూడి నవీన్, దోసపాటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



గువ్వలగూడెంలో సీసీరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి


కిన్నెరసాని గిరిజన క్రీడల పాఠశాల

తినలేక.. ఉండలేక

▸▸ జిల్లాలో ఏకైక క్రీడల పాఠశాల దుస్థితి

▸▸ విద్యనభ్యసిస్తున్న 211 మంది విద్యార్థులు

▸▸ సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

పాల్వంచ రూరల్, ఆగస్టు4: ఉడికి ఉడకని అన్నం.. నీళ్ల చారు.. తినలేక పోతున్న పరిస్థితి.. గదుల్లో కిటికీలు లేవు... వర్షానికి కిటికీలు లేక దుప్పట్లు కట్టుకొని విద్యార్థులు ఉండాల్సిన దుస్థితి నెలకొంది. భద్రాద్రి జిల్లాలో గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్రీడల పాఠశాల ఇది.. ఇక్కడ విద్యార్థుల అవస్థలు మాత్రం అంతాఇంతా కాదు.

పాల్వంచ మండలంలోని కిన్నెరసానిలో గిరిజన క్రీడల పాఠశాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఇక్కడ చదువుతున్న గిరిజన విద్యార్థులు క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో అత్యున్నత స్థానం పొందిన వారు ఉన్నారు. జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో సైతం పాల్గొని తమ ప్రతిభను కనబర్చారు. గిరిజన విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలనే లక్ష్యంతో ఇక్కడ క్రీడల పాఠశాలను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా క్రీడల పైన దృష్టి సారించారు. ప్రత్యేకంగా క్రీడల ఉపాధ్యాయులను నియమించారు. ఉమ్మడి జిల్లా నుంచి ఇక్కడ 211మంది గిరిజన విద్యార్థులు చదువుతున్నారు. 15 ఏళ్లుగా ఇక్కడ ఈ క్రీడల పాఠశాలను ఏర్పాటు చేసి ఐటీడీఏ పర్యవేక్షణలో నడిపిస్తున్నారు. అవసరమైన క్రీడాసామాగ్రిని సమకూర్చి మైదానాన్ని ఏర్పాటు చేశారు.



విద్యార్థుల అవస్థలు ...

ఈ హాస్టల్‌కు జీసీ సీ నుంచి సరఫరా చేస్తున్నబియ్యం వల్ల అన్నం ఉడికి ఉడకనట్లుగా ఉంటుంది. ముద్దలు ముద్దలుగా ఉండటంతో విద్యార్థులు తినలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు నీళ్ల చారు, పప్పు నాలుగు మద్దలతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. చాలీచాలని అన్నం తిని మిగిలిన భోజనాన్ని విద్యార్థులు చెత్తబుట్టలో పడేస్తున్నారు. బియ్యం సక్రమంగా లేక పోవడం వల్ల అన్నం ముద్దలుగా మారి ఉడికి ఉడకనట్లుగా ఉంటుందని వంటవర్కర్స్ తెలిపారు. జీసీసీ నుంచి మంచి బియ్యం రావడం లేదని, ఒక్కొక్క బస్తా తేడా ఉండ టం వల్ల అన్నం మెత్తగా, గడ్డలు అవుతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రీడల పాఠశాలల విద్యార్థులకు తగిన పౌష్టికాహా రం అందించాలని, ప్రత్యేకమైన మెనుచార్ట్‌ను అమలు చేయాలని, ఐటీడీఏ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, పౌష్టికాహారం అందించాలని కోరుతున్నారు.

కిటికీలు, తలుపులకు దుప్పట్లే దిక్కు

అసలే వర్షాలు ఎడతెరిపి లేకుండ కురుస్తున్నాయి.. 211 మంది విద్యార్థులు 12 గదుల్లో ఉంటున్నారు. కిటికీలకు త లుపులు లేక పోవడంతో వర్షం నీరు గదుల్లోకి వచ్చి చేరుతోంది. వర్షం జల్లులు గదుల్లో పడకుండా విద్యార్థులు అనేక తిప్పలు పడుతున్నా రు. కప్పుకునే దుప్పట్లను కిటికీలకు కట్టుకొని ఉంటున్నారు. వర్షపు నీటితో పుస్తకాలు, దుప్పట్లు తడిచి ముద్దవుతున్నాయని వాపోతున్నారు. పాఠశాల, హాస్ట ల్ వేర్వేరుగా ఉన్నప్పటికీ రాత్రి సమయంలో హాస్టల్‌లో ఉండటం విద్యార్థులకు తలమానికంగా మారింది. ఇక్కడ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణిస్తున్నారు. అయితే వండిపెట్టే ఆహారం, సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. వెంటనే ఐటీడీఏ పీవో దృష్టి సారించి క్రీడా పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

జక్కంపూడి కుటుంబానికి పరామర్శ

● జక్కంపూడి కృష్ణమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పించిన మంత్రి పొంగులేటి


జక్కంపూడి కృష్ణమూర్తి దంపతుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తల్లాడ, ఆగస్టు 4: తల్లాడ మండలం బిల్లుపాడులో ఇటీవల మృతి చెందిన సీనియర్ రాజకీయ నేత జక్కంపూడి కృష్ణమూర్తి కుటుంబాన్ని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా జక్కంపూడి కృష్ణమూర్తి-ప్రేమలత దంపతుల చిత్రపటాలకు మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుమారులు కిషోర్, రాములను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం నారాయణపురం గ్రామంలో మృతిచెందిన రెడ్డెం వీర సింహారెడ్డి కుటుంబాన్ని కూడా మంత్రి పరామర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, తుళ్లూరి బ్రహ్మయ్య, దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్, గోపిశెట్టి వెంకటేశ్వర్లు, రాయల రాము, పొట్టేటి జనార్ధన్‌రెడ్డి, ఎర్రి నర్సింహారావు, తుమ్మలపల్లి రమేష్, గణేశుల రవి, తూము వెంకటనారాయణ, గుర్రం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం

●జాన్‌పహాడ్‌తండాలో ఘటన

ఖమ్మం రూరల్, ఆగస్టు4: వ్యవసాయ భూమికి చెందిన వివాదంతో మనస్తాపం చెందిన ఓ రైతు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన ఖమ్మం రూరల్ మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జాన్‌పహాడ్‌తండాకు చెందిన ఏలేటి వెంకటరెడ్డికి అదే గ్రామానికి చెందిన మరి కొందరి మధ్య భూ వివాదం నెలకొంది. తనకు చెందిన వ్యవసాయ భూమిలోకి అదే గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధి కలింగరెడ్డి ప్రోద్బలంతో జాటోతు వీరన్న, సురేష్, దేవిక, చిన్ని, ఉపేందర్‌లు ప్రవేశించి దుర్భాషలాడారు. దీంతో మనస్తాపం చెందిన వెంకటరెడ్డి ఆదివారం ఉదయం సెల్ఫీ తీసుకుంటూ క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. జరిగిన సంఘటనపై వెంకటరెడ్డి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రామారావు తెలిపారు.

స్కానింగ్ సెంటర్‌పై మహిళ ఫిర్యాదు

సత్తుపల్లిరూరల్, ఆగస్టు4: ఓ స్కానింగ్ సెంటర్‌పై పోలీసులకు మహిళ ఫిర్యాదు చేసిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని రామానగరానికి చెందిన ఓ బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లోని ఓ స్కానింగ్ సెంటర్‌కు బాధితురాలు టిఫ్పా స్కాన్ పరీక్ష కోసం వెళ్లింది. కాగా స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు ఫటల్ ఎకో స్కాన్ చేశారు. ఇది గమనించిన వారు తప్పుడు స్కాన్ ఎలా చేస్తారని మహిళ ప్రశ్నించగా, తనతో వాగ్వాదానికి దిగడంతో పాటు చెల్లించిన నగదును కూడా ఇవ్వకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. సదరు వైద్యుడికి అపాలజీ లెటర్ రాసిస్తేనే మరలా ఆమెకు స్కాన్ చేసి రిపోర్టులు ఇస్తామని తెలపగా, తప్పు మీరు చేసి మమ్మల్ని క్షమించాలని ఎలా అడుగుతారని బాధితురాలు ఫిర్యాదు ద్వారా పేర్కొన్నారు. గర్భిణి అని కూడా చూడకుండా తనకు తప్పుడు స్కానింగ్ టెస్ట్ చేయడంతో పాటు, అకారణంగా చాలాసేపు ఉంచారని, దీంతో మనస్తాపానికి గురైన ఆమె సత్తుపల్లి పోలీసులకు న్యాయం చేయాలంటూ ఫిర్యాదు చేసింది. ఇదే విషయమై స్కానింగ్ సెంటర్ నిర్వాహకులను సంప్రదించగా బాధితురాలు పోలీసులను సంప్రదించిన అనంతరం, వారికి ఆన్‌లైన్ ద్వారా నగదు పంపించామని తెలిపారు. కాగా పట్టణ సీఐ టీ.కిరణ్‌ను వివరణ కోరగా బాధితురాలు ఫిర్యాదు చేసిన విషయం వాస్తవమేనన్నారు.

పూర్వ వైభవం కోసమే రంగస్థల నాటిక పోటీలు


మాట్లాడుతున్న నాటిక పోటీల నిర్వాహకులు

ఖమ్మంసాంస్కృతికం, ఆగస్టు4: అంతరించి పోతున్న నాటిక కళకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు తమ వంతు బాధ్యతగా ఖమ్మంలో రెండు రాష్ట్రాల స్థాయి ఆహ్వానిత నాటిక పోటీలను ఈనెల 9 నుంచి 11 వరకు నిర్వహిస్తామని నెలనెల వెన్నెల కళాసంస్థ బాధ్యుడు ఎఎస్ కుమార్, ఖమ్మం కళాపరిషత్ అధ్యక్ష, కార్యదర్శులుడాక్టర్ నాగబత్తిని రవి, వేల్పుల విజేత, ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షుడు సదానంద్ అన్నారు. భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గతంలో ఒక వెలుగు వెలిగి ఎందరినో చైతన్య వంతులను చేసిన రంగ స్థలం క్రమేపి ఆదరణ కోల్పోతున్న తరుణంలో తమవంతు బాధ్యతగా నాటక రంగ పరిరక్షణకు పూనుకున్నామన్నారు. ఈనెల 9న నాటిక పోటీలకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, 10న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, 11వ తేదీన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అతిథులుగా హాజరవుతారని తెలిపారు. వీరితోపాటు భాషాసాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రమణాచారిలు పాల్గొంటారని చెప్పారు. నాటిక పోటీలతోపాటు జిల్లాకు చెందిన సీనియర్ నాటక రంగ కళాకారులు తాటికొండాల నరసింహారావు, పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్‌లకు స్తంభాద్రి పురస్కారాలు అందజేస్తామన్నారు. సమావేశంలో మోటమర్రి జగన్మోహనరావు, నామా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా చిన్నప్పయ్య



ఇల్లెందు, ఆగస్టు4: ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఏర్నం చిన్నప్పయ్య నియమితులయ్యారు. ఆయన ఇప్పటివరకు పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. ఇల్లెందు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పోలారపు పద్మను పాల్వంచ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో విద్యార్థుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాలలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 15 మంది లెక్చరర్లు ఉన్నారని, తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తమ పిల్లలను చేర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అర్హత కలిగిన వారికి త్వరలో ప్రమోషన్లు

● విద్యుత్‌శాఖ సీఎండీ వరుణ్‌రెడ్డి

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 4: విద్యుత్‌శాఖలో అర్హత కలిగిన ఉద్యోగులకు త్వరలో ప్రమోషన్లు అందిస్తామని అడ్డంకులను తొలగించేందుకు సంస్థ పరంగా చర్యలు చేపట్టామని విద్యుత్‌శాఖ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 రాష్ట్ర అధ్యక్షుడు తక్కెళ్లపల్లి శేషగిరిరావు పదవీ విరమణ సభలో ఆయన పాల్గొని శేషగిరిరావు, రాజ్యలక్ష్మి దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులతో పనిచేయిస్తూ వారి హక్కుల కోసం 33 ఏళ్లగా 1104 యూనియన్ ద్వారా శేషగిరిరావు పోరాటాలు చేశారని అభినందించారు. విద్యుత్‌శాఖ ఉద్యోగులకు క్రమశిక్షణతో పనిచేసే విధంగా ప్రోత్సహించారని గుర్తు చేశారు. మంచి క్రమశిక్షణతో విద్యుత్ సంస్థ నిర్ణయాలను ఇచ్చితంగా ఉద్యోగులు పని చేసేలా శేషగిరిరావు పనిచేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సురేంద్ర, డీఈలు రామారావు, బాబురావు, హీరాలాల్, నాగేశ్వరరావు, భద్రపవర్, రాములు, నాయకులు సీతారామయ్య, సురేశ్, శ్రీధర్, రమణారెడ్డి, రమణ, మధురి, మంజుల పాల్గొన్నారు.


శేషగిరిరావు దంపతులను సన్మానిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

మందుపాతర గుర్తింపు.. పేల్చివేత

● చర్ల మండలం పూసుగుప్ప వద్ద ఘటన

చర్ల, ఆగస్టు4: మండలంలోని పూసుగుప్ప గ్రామ శివారు లోని రహదారిపై ఆదివారం చర్ల పోలీసులు మందుపాతరను గుర్తించారు. అనంతరం బాంబ్‌స్క్వాడ్ సహాయంతో దాన్ని పేల్చివేశారు. మావోయిస్టు పార్టీ అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో గత పది రోజులుగా చర్ల పోలీసులు చర్ల, పూసుగుప్ప రహదారిపై బాంబ్‌స్క్వాడ్ సహాయంతో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో రోటింత వాగు సమీపంలోని ఓ వంతెన వద్ద మావోయిస్టులు అమర్చిన మందుపాతరను తనిఖీ చేస్తున్న బలగాలు గుర్తించాయి. అనంతరం ఆ మందుపాతరను బాంబ్‌స్క్వాడ్ సహాయంతో పేల్చివేశారు. పోలీసులు గుర్తించిన మందుపాతర ఐదు కేజీలు ఉన్నట్లు తెలుస్తోంది.

బాలికపై లైంగిక దాడి

తల్లాడ, ఆగస్టు 4: ఆరుబయట ఆడుకుంటున్న ఆరేళ్ల చిన్నారిని ఎత్తుకెళ్లి ఓ పదిహేనేళ్ల బాలుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. తల్లాడ మండలంలోని ఓ గ్రామంలో ఆదివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఆరేళ్ల చిన్నారి తన అన్నలతో కలిసి ఆటాడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన 15ఏళ్ల బాలుడు ఆ చిన్నారిని బలవంతంగా తన ఇంటికి ఎత్తుకెళ్లాడు. చిన్నారి కేకలు వేస్తున్నా పట్టించుకోకుండా లైంగికదాడికి పాల్పడ్డాడు. చిన్నారిని బలవంతంగా ఎత్తుకెళ్లిన విషయాన్ని చిన్నారి అన్నలు తమ తల్లికి చెప్పడంతో వెంటనే ఆమె ఏడుస్తున్న చిన్నారి వద్దకు వెళ్లి చూడగా అప్పటికే బాలుడి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. దాంతో జరిగిన ఘటనపై బాలిక తల్లి తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ బి.కొండల్‌రావు కేసు నమోదు చేశారు. చిన్నారిని చికిత్స కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి


వైష్ణవి(ఫైల్)

వేంసూరు, ఆగస్టు 4: విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి చెందిన సంఘటన మండలంలోని రామన్నపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన చిత్తా హరిబాబు ఇంట్లో గత నెల 29వ తేదీన ప్రమాదవశాత్తూ జరిగిన విద్యుదాఘాతంలో అతడి భార్య రోజా, కుమార్తె వైష్ణవి(14)లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కుమార్తె వైష్ణవి శనివారం రాత్రి మృతి చెందింది. అడసర్లపాడు ఉన్నత పాఠశాలలో చదువుతుంది.

గోడ కూలి వ్యక్తి ..

భద్రాచలం, ఆగస్టు 4: గోడ కూలి వ్యక్తి మృతి చెందిన సంఘటన భద్రాచలంలో ఆది వారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాచలంలోని తాతగుడి సెంటర్‌లో ఉన్న ఓ హోటల్‌లో పని చేస్తున్న వెంకన్న(47) ఆదివారం ఉదయం హోట ల్‌లో పని నిమిత్తం విధుల్లోకి వచ్చాడు. అక్కడ నీళ్లు పడుతుండగా, ఇటీవల వర్షాలకు బాగా తడిచిపోయిన పక్కనే ఉన్న ఇంటి గోడ అతడిపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పేకాట స్థావరంపై దాడి

● దాడిలో నలుగురు న్యాయవాదులు పట్టుబడినట్లు సమాచారం ?

ఖమ్మంక్రైం, ఆగస్టు4: ఖమ్మం నగరంలోని ఓ ఇంటిలో పేకాట ఆడుతుండగా పోలీసులు దాడులు నిర్వహించి, పలువురు న్యాయవాదులను పట్టుకున్నట్లు సమాచారం. నగరంలోని శ్రీరామ్‌హిల్స్ సమీప ప్రాంతంలో ఓ ఇంటిలో నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్టు ఖానాపురంహవేలి పోలీసులకు సమాచారం అందడంతో వారు సంఘటన స్థలం వద్దకు వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఈతనిఖీలలో నలుగురు ప్రముఖ న్యాయవాదులు పట్టుబడినట్టు తెలిసింది. దీంతో వారిని అదుపులోకి తీసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్టు సమాచారం. అదేవిధంగా వారి వద్ద నుంచి సుమారు రూ.2,640 నగదు కూడా స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. ఈఘటనపై పోలీసులను సంప్రదించగా ఇంకా వివరాలు వెల్లడించలేదు.

ప్రభుత్వ స్థలం ఆక్రమించిన ఇద్దరిపై కేసు నమోదు

ఖమ్మం రూరల్ ఆగస్టు 4: ప్రభుత్వ స్థలం ఆక్రమించిన వారిపై ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సత్యనారాయణపురం సమీపంలో సుమారు 20గుంటల ప్రభుత్వ భూమిని ఖమ్మం రూరల్ ఏసీపీ కార్యాలయ నిర్మాణం కోసం 2022లో నాటి కలెక్టర్ గౌతమ్ కేటాయించారు. చిన్న తండాకు చెందిన బానోత్ వెంకన్న, సత్యనారాయణపురం(కొత్తూరు) గ్రామానికి చెందిన చెందిన ఆడేపు కౌలస్యలు ఏసీపీ కార్యాలయానికి కేటాయించిన స్థలంలో అక్రమంగా ప్రవేశించి, స్థలాన్ని చదును చేసి షెడ్లు నిర్మించారు. బ్లూకోడ్ కానిస్టేబుల్స్ ఆ షెడ్లను గమనించి, వెంటనే పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. కానిస్టేబుల్ చందులాల్ ఫిర్యాదు మేరకు, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.

ఈ యేడాదికి లేనట్లేనా..

▸▸ ఆదిలోనే ఆగిపోయిన మధిరకు మంజూరైన గిరిజన గురుకులం ఏర్పాటు

▸▸ అద్దె భవనం కోసం సర్వేల దగ్గరే ఆగిన వైనం


మధిరలో ఎస్టీ బాలుర హాస్టల్ భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

మధిర, ఆగస్టు 4: మధిరకు మంజూరైన గిరిజన గురుకులం ఏర్పాటుకు ఆదిలోనే హంసపాదం అన్నట్లు అడ్డంకులు ఎదురయ్యాయి. మంజూరై ఈ యేడాది ప్రారంభిస్తారనుకున్న గిరిజన గురుకులం ఆగినట్లేనని తెలుస్తోంది. మధిరలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి చదువుకుంటున్న గిరిజన విద్యార్థుల కోరిక మేరకు ప్రభుత్వం ఎట్టకేలకు ఈఏడాది గిరిజన బాలుర గురుకులం పాఠశాల మంజూరు చేసింది. దీంతో గిరిజన విద్యార్థులు ఎంతో సంతోషపడ్డారు. అధికారులు కూడా ఈ యేడాదే మధిరలో గురుకులం ప్రారంభిస్తామని, అందుకు అవసరమైన భవనాల కోసం సర్వే చేశారు. జూన్ 13వతేదీన ఉమ్మడి జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్, అప్పటి ఆర్‌సీవో వెంకటేశ్వరరాజు మధిర వచ్చి మూడు భవనాలను పరిశీలించారు. ఒక ప్రభుత్వ భవనం, రెండు ప్రైవేట్ భవనాలను పరిశీలించిన ఆయన మధిర బాలుర గిరిజన హాస్టల్ భవనం అనుకూలంగా ఉందని ఆమేరకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. భవనాల పరిశీలనతోనే ఆగిపోయాయి.

కాగా ఇటీవల భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా కలెక్టర్, ఐటీడీవో పీవోలు బదిలీ అయ్యారు. అంతేకాక సర్వే చేసిన నివేదిక ఇచ్చిన ఆర్‌సీవో అధికారి కూడా బదిలీ అయ్యారు. అంతా కొత్తవారే కావడంతో ఇక మధిర గిరిజన గురుకులం విషయం మరుగునపడింది. అది గాక ప్రభుత్వం అన్ని గురుకులాలను కలిపి ఒకేచోట ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ ప్రతిపాదనలు తీసుకురావడంతో మధిరలో గిరిజన గురుకులం ఏర్పాటు ఆగిపోయినట్లేనని ఆశాఖ నుంచి వినిపిస్తుంది. దీంతో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న గురుకులం ఎట్టకేలకు వస్తుందని ఆశపడ్డ గిరిజన విద్యార్థులు, ఆగస్టు వచ్చినా ఆఊసే లేకపోవడంతో నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం జరిగి అందుబాటులోకి వచ్చే సరికి సమయం పడుతుంది కాబట్టి, ప్రస్తుతం అందుబాటులో ఉన్న భవనంలో గిరిజన గురుకుల పాఠశాల ప్రారంభించాలని, ఆమేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చొరవ తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

భార్య కళ్లెదుటే.. చెరువులో మునిగి భర్త దుర్మరణం


విజయ్(ఫైల్)

వైరా, ఆగస్టు 4: భార్య, భర్తలు ఇద్దరు కలిసి తమకున్న గేదెలను తీసుకొని సమీపంలోని చెరువు వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో గేదెలు మేత మేసుకుంటూ చెరువులోకి వెళ్లాయి. వాటిని తోలుకొచ్చేందుకు వెళ్లిన భర్త కాళ్లకు తామర పూల తీగె చుట్టుకోవడంతో నీళ్లలో ఈదలేక భార్య కళ్లెదుటే నీట మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన సోమవరం నల్లచెరువులో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవరం గ్రామానికి చెందిన కంటెపూడి విజయ్(47) భార్యతో కలిసి గేదెలను చెరువు వద్దకు మేత కోసం తోలుకెళ్లాడు. గేదెలు చెరువులోని నీటిలోనుంచి బయటకు రాకపోవడంతో, వాటిని బయటకు తోలుకొచ్చేందుకు చెరువులోకి దిగిన విజయ్ తామర పూల తీగె కాళ్లకు చుట్టుకోవడంతో ఈదలేక భార్య కళ్లెదుటే నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చౌటుప్పల్‌లో రోడ్డు ప్రమాదం

● వైరా వాసి మృతి


వీరభద్రం మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న దుర్గాప్రసాద్

వైరా, ఆగస్టు 4: హైదరాబాద్, విజయవాడ జాతీయ ప్రధాన రహదారిలో చౌటప్పల్ వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వైరాలోని నాల్గోవార్డుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు పదిమల వీరభద్రం(65) మృతి చెందారు. మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, మాజీ ఎంపీటీసీ పదిమల పుష్పలత భర్త అయిన వీరభద్రం హైదరాబాద్ విమానాశ్రయానికి వెళ్తూ తాను ప్రయాణిస్తున్న కారు లారీని ఢీకొట్టిన ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని ఆదివారం వైరాలోని ఆయన స్వగృహానికి తీసుకువచ్చారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకులు పుచ్చకాయల వీరభద్రం, పాలేటి నర్సింహారావు, పొదిల హరినాథ్, పమ్మి అశోక్, బోళ్ల గంగారావు, శీలం చంద్రశేఖరరెడ్డి, పణితి శ్రీను, వాడపల్లి రాము, తోటకూర గోపి, వీరబాబు, మున్నా యాదవ్ తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

గంజాయిని పట్టుకున్న డాగ్ స్క్వాడ్

● రెండు కేజీల గంజాయి స్వాధీనం, ఇద్దరి అరెస్టు


గంజాయిని అన్వేషిస్తున్న డాగ్ స్క్వాడ్

మణుగూరు, ఆగస్టు 4: మణుగూరు మండలంలో గంజాయి విక్రయాలను అరికట్టేందుకు మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి కొత్త విధానాన్ని అవలంభించారు. ఆదివారం గంజాయిని పసిగట్టే డాగ్ స్క్వాడ్‌ను (డాగ్)ను రంగంలోకి దింపారు. మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని శివలింగాపురం బాపన కుంట గ్రామాల్లో ఈ స్క్వాడ్ ద్వారా ప్రత్యేక తనిఖీలను సీఐ సతీష్‌కుమార్ చేపట్టారు. దీంతో గంజాయి విక్రయించే వారి ఆచూకీ లభించింది. వారు పలు ప్రాంతాల్లో నేలలో దాచిన గంజాయిని డాగ్ పసిగట్టింది. గంజాయిని దాచిన ఇద్దరి వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి, వారు దాచిన రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

మావోయిస్టుల పేరుతో వెలిసిన బ్యానర్

కొణిజర్ల, ఆగస్టు 4: మండల పరిధిలోని పెద్దరామాపురం గ్రామసమీపంలో రహదారి పక్కన పంట పొలాల్లో మావోయిస్టుల పేరుతో ఎర్రని వస్త్రంతో కూడిన బ్యానర్ వెలిసింది. అందులో పీడిత ప్రజల విముక్తి కోసం ప్రాణాలర్పించిన అమరుల త్యాగం వృథా కాదు.. వారి ఆశయాలను, విప్లవ త్యాగాలను ఎత్తిపడతాం, 2024 జూలై 28నుంచి ఆగస్టు 3వరకు అమరవీరుల సంస్మరణ వారాన్ని జరపండి, ప్రజలపై మావోయిస్టు పార్టీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న ప్రతి ఘాతుక యుద్ధం ఆపరేషన్ కధార్‌ను వ్యతిరేకించండంటూ బ్యానర్ వెలిసింది. దీంతో మావోయిస్టుల పేరుతో బ్యానర్ వెలవడం పట్ల చర్చానీయాంశంగా మారింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ శంకర్రావ్ బ్యానర్‌ను పరిశీలించి తొలగించారు. ఈ విషయమై ఎస్‌ఐను అడుగగా ఇది మావోయిస్టులు కట్టిన బ్యానర్ కాదని, ఆకతాయిల పని అని తెలిపారు.


పెద్దరామాపురం సమీపంలో మావోయిస్టుల పేరుతో వెలిసిన బ్యానర్

దుమ్ముగూడెం పోస్టాఫీస్‌లో ప్రజల పాట్లు

●ఎస్‌వోగా వచ్చిన అధికారి భాష అర్థంకాక ఖాతాదారుల ఇక్కట్లు

దుమ్ముగూడెం, ఆగస్టు4: దుమ్ముగూడెం సబ్-పోస్టాఫీస్‌లో సేవా లోపంతో పోస్టల్ ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల భద్రాచలం ప్రధాన కార్యాలయం నుంచి ఉత్తరాది రాష్ట్రానికి చెందిన ఒక పోస్టుమాస్టరు దుమ్ముగూడెం ఎస్‌వోకు డిప్యూటేషన్‌పై రాగా, అయనకు హిందీ, ఇంగ్లీష్ భాషలు మినహాయించి అసలు తెలుగులో మాట్లాడడం రాదు. పోస్టాఫీసుకు వచ్చే ఖాతాదారులు తాము ఏం చెబుతున్నారో పోస్టుమాస్టర్‌కు అర్థం కాకపోవడంతో మధ్యలో ఎవరైనా కల్పించుకొని భాషను తర్జుమా చేయాల్సి వస్తోంది. దీంతో ఖాతాదారులు తమ లావాదేవీలు జరపడం కష్టతరంగా మారింది. దుమ్ముగూడెం ఎస్‌వో పరిధిలో మొత్తం ఇరవై తొమ్మిది బ్రాంచ్ పోస్టాఫీసులుండగా, నిత్యం వాటికి సంబంధించిన లావాదేవీలతోపాటు ఎస్‌వో లావాదేవీలను సకాలంలో పూర్తి చేయాల్సి ఉంటుంది. అలాగే సబ్-పోస్టాఫీస్‌కు నిత్యం వచ్చే ఖాతాదారుల ఆర్డీలు, నగదు విత్‌డ్రాలు, రిజిష్టర్ పోస్ట్ వంటి పనులను చూడాల్సి ఉంటుంది. ఏజన్సీ ప్రాంతమవడంతో ఖాతాదారులకు పెద్దగా ఇంగ్లీష్, హిందీ భాషలు మాట్లాడడం రాక, సేవల్లో జాప్యం తలెత్తుతోంది. మరో పక్క గడువు ముగిసిన ఆర్డీలకు సంబంధించిన నగదును రోజుల తరబడి చెల్లించడం లేదని ఖాతాదారులు గగ్గోలు పెడుతున్నారు. ఖాతాదారుల సమస్యల దృష్ట్యా తెలుగులో లావాదేవీలు జరపగలిగే పోస్టుమాస్టర్‌ను వెంటనే నియమించాలని ఖాతాదారులు కోరుతున్నారు.

రక్తంతో పవన్‌కల్యాణ్ చిత్రం

• అభిమానాన్ని చాటుకున్న ముదిగొండ యువకుడు


పవన్‌కల్యాణ్ చిత్రాన్ని గీస్తున్న అఖిల్

ముదిగొండ, ఆగస్టు 4: తన రక్తంతో ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌బొమ్మగీసి ఆయనపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నాడు ఓ యువకుడు.. ఖమ్మం జిల్లా ముదిగొండ గ్రామానికి చెందిన మాణిక్యం అఖిల్‌కు పవన్ కల్యాణ్ అంటే వీరాభిమానం.. పవన్ ప్రస్తుతం ఏపీ డిప్యూటీ సీఎం కావడంతో ఆయనపై ఉన్న అభిమానాన్ని చాటుకునేందుకు కళాకారుడైన అఖిల్ తన రక్తంతో పవన్ బొమ్మగీశాడు. ఈ చిత్రాన్ని గీసేందుకు తనకు ఐదుగంటల సమయం పట్టిందని అఖిల్ తెలిపాడు. చిత్రం పూర్తి చేయడానికి తనకు ఐదు మిల్లీలీటర్ల రక్తం అవసరమైందని అతడు వివరించాడు. స్వతహాగా కళాకారుడైన అఖిల్ తన కళతోనే పవన్‌కల్యాణ్‌పై ఉన్న అభిమానాన్ని విభిన్నంగా వ్యక్తం చేశాడు. అతడి ప్రయత్నాన్ని పలువురు అభినందించారు.

ఎంపీటీసీలకు సన్మానం

వేంసూరు,ఆగస్టు4: పదవీకాలం ముగియనుండటంతో ఎంపీటీసీలకు ఆదివారం మండలపరిషత్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ మారోజు సుమలత, వైస్ఎంపీపీ దొడ్డా శ్రీలక్ష్మీతోపాటు ఎంపీటీసీలు పుచ్చకాయల లక్ష్మీ, నాయుడు వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లకు అధికారులు పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎంఎ.రాజు, ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో రంజిత్‌కుమార్, ఏవో రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.



ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న అధికారులు

భూఆక్రమణదారులను ఉపేక్షించొద్దు

- ఎంతటి వారినైనా వదలొద్దు
- గంజాయి విక్రయాలపైనా ఉక్కుపాదం మోపాలి
- సీపీ సునీల్‌దత్‌కు మంత్రి పొంగులేటి ఆదేశం

కూసుమంచి,ఆగస్టు4: భూకబ్జాదారులు ఎంతటివారైనా ఉపేక్షించొద్దు, వారిని బొక్కలోవేయాలని ఖమ్మం పోలీస్ కమీషనర్‌ను రెవిన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఆదివారం కూసుమంచి క్యాంపుకార్యాలయంలో మంత్రి పొంగులేటితో సీపీ సమావేశమయ్యారు. శాంతిభద్రతలపై చర్చించారు. రైతుల భూములు ఆక్రమించుకుంటూ వారి ఆత్మహత్యలకు కారణమవుతున్న కబ్జాదారులు ఎంతటివారైనా ఉపేక్షించొద్దని ఆదేశించారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి ఆక్రమణలకు పాల్పడుతున్నారని తెలిపారు. కొందరు ప్రభుత్వ భూములను కూడా ఆక్రమిస్తున్నారని వారిని గుర్తించి చర్యలను తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో గంజాయి విక్రయాలు పెరిగాయని, ప్రత్యేక దృష్టి సారించి నివారించాలని మంత్రి తెలిపారు. వారిపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. గంజాయి మూలంగా యువత పెడదారి పడుతోందని తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్‌లలో ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు జరిగేలా చూడాలన్నారు.



మంత్రి పొంగులేటితో సమావేశమైన సీపీ

161 మందికి చెక్కుల పంపిణీ

కూసుమంచి: రోగులకు ఆర్థిక భరోసా కల్పించే సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఇకనుంచి ఆలస్యం కాకుండా వేగంగా అందించే ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కూసుమంచి క్యాంపుకార్యాలయంలో రూ.46.20లక్షల విలువైన 161 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల వైద్యానికి నిధులు వెచ్చించలేదని, తాము నిధులు కేటాయించి మంజూరీ చేయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇక నుంచి రోగి దరఖాస్తు చేసుకున్న నెల రోజుల్లోపే చెక్కులు అందేలా చూస్తున్నట్లు పొంగులేటి తెలిపారు. కార్యక్రమంలో క్యాంపుకార్యాలయం ఇన్చార్జ్ దయాకర్‌రెడ్డి, రాష్ట్ర గిడ్డంగులసంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, ఆయా మండలాల ఎంపీపీలు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు అందజేసిన మంత్రి పొంగులేటి

ఖమ్మంరూరల్: మండల పరిధిలోని పోలేపల్లి పంచాయతీలో లబ్ధిదారులకు కేటాయించిన రెండు పడక గదుల ఇళ్లకు రెవెన్యూ గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఇళ్ల పట్టాలను అందజేశారు. గతంలో ఇళ్లు కేటాయించినా, పట్టాలు తమకు ఇవ్వలేదని లబ్ధిదారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మంత్రి పొంగులేటి ప్రత్యేక చొరవతీసుకొని 18 మందికి పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాంప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.





ఖమ్మం నగరంలో పాదచారులు నడవకుండా ఫుట్‌పాత్‌లపై ఉంచిన సామగ్రి

ఫుట్‌పాత్ వ్యాపారం

- పాదచారులు నడిచే వీలులేని పరిస్థితి
- పట్టించుకోని మునిసిపల్ అధికారులు

ఖమ్మంసంక్షేమ విభాగం, ఆగస్టు 4: ఖమ్మం నగరం రోజు రోజుకు విస్తరిస్తోంది. దీంతో రహదారులతో పాటుగా పాదచారులు నడిచేందుకు ప్రభుత్వం రూ. వందల కోట్లుతో ఖమ్మంలోని ప్రధాన వీధుల వెంట ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టింది. పాదచారుల సౌకర్యం కోసం నిర్మాణం చేసిన ఫుట్‌పాత్‌లు వ్యాపారులకు వరంగా మారాయి.. దుకాణంలోని అమ్మకపు వస్తువులను యథేచ్ఛగా ఫుట్‌పాత్‌లపై అమ్మకాలు జరుపుతున్నారు. ముఖ్యంగా ఖమ్మం వైరా ప్రధాన రహదారి వెంట ఒకరిని చూసి మరో వ్యాపారి ఇలా ఫుట్‌పాత్‌లను ఆక్రమించారు. పాతబస్టాండ్, జెడ్పీ సెంటర్, ఇల్లెందు క్రాస్‌రోడ్డు వంటి బస్టాండ్ సెంటర్‌లో బస్ దిగిన ప్రయాణికులు కాలు మోపాలంటే స్థలం దొరకటం లేదు. ఈ కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌ల ఆక్రమించిన వారికి జరిమానా విధించటంతో పాటు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అడుగుకో గుంత.. రోగుల చింత

ఖమ్మంకలెక్టరేట్,ఆగస్టు4: జిల్లా జనరల్ ఆస్పత్రిలో అడుగుకో గుంత ఏర్పడ్డాయి. కొద్దిరోజులుగా కురిసిన వర్షాలకు ఏర్పడిన గుంతల్లో నీరు చేరింది. జిల్లా ఆస్పత్రిలోని ట్రామాకేర్ ఎదురుగా గుంతలు రోగులకు తీరని ఇక్కట్లు తెచ్చిపెడుతున్నాయి. సదరం క్యాంపు ప్రాంతంలోనూ రోడ్డు అధ్వానస్థితికి చేరుకుంది. దీంతో ఆస్పత్రికి ద్విచక్ర వాహనాలపై వచ్చే రోగులు, ఆటోల్లో వచ్చే వారికి కుదుపులు సర్వసాధార ణం అయ్యింది. అంతే కాదు నడిచే వారికి వాహనాల కారణంగా బురద పడుతుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



కాంగ్రెస్ నాయకుడు ముస్తాఫాకు పితృవియోగం

నివాళులర్పించిన మంత్రులు తుమ్మల, పొంగులేటి

ఖమ్మంసంక్షేమవిభాగం, ఆగస్టు4: కాంగ్రెస్ జిల్లా మైనార్టీ నాయకులు ఎండీ ముస్తాఫా తండ్రి ఘని(82) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం ఖమ్మంలోని ప్రైవేట్ హాస్పటల్‌లో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి వేర్వేరుగా ఆయన ఇంటికి వెళ్లి భౌతిక కాయం వద్ద నివాళులు అర్పించారు. కార్పొరేటర్ రఫీదా బేగం, ముస్తాఫాను మంత్రులు ఓదార్చారు. కార్పొరేటర్లు మిక్కిలినేని మంజుల, రాపర్తిశరత్, నాయకులు మిక్కిలినేని నరేందర్ ముస్తాఫాను పరామర్శించారు.





ఘని భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న తుమ్మల, వెంకటరెడ్డి చిత్రం పటం వద్ద నివాళి

రఘునాథపాలెం మండలంలో పర్యటన

రఘునాథపాలెం: వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం మండల వ్యాప్తంగా పర్యటించారు. వేపకుంట్ల, పంగిడి, ఇర్లపూడి, రాంక్యాతండా, కోటపాడు, కోయచెలకలో ఇటీవల కాలంలో కన్నుమూసిన కాంగ్రెస్ నాయకులు, సానుభూతిపరుల బాధిత కుటుంబాలను పరామర్శించారు. కుటుంబాలకు అండగా ఉంటామని మంత్రి తుమ్మల హామీ ఇచ్చారు. నాయకులు మానుకొండ రాధాకిషోర్, సాధు రమేశ్‌రెడ్డి, కార్పొరేటర్లు మలీదు జగన్, లకావత్ సైదులునాయక్, మలీదు వెంకటేశ్వర్లు, కోటేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్వచ్ఛదనం.. పచ్చదనం

60 డివిజన్లలో ఏర్పాట్లు

ఖమ్మంసంక్షేమ విభాగం, ఆగస్టు 4: పట్టణాల పారిశుద్యం మరియు పచ్చదనం పెంపొందించేందుకు పిలుపునిచ్చిన స్వచ్ఛదనం పచ్చదనం సోమవారం నుంచి ఖమ్మం నగరంలో ప్రారంబం కానుంది. 5రోజులు పాటుగా ఈనెల 9వరకు నగరంలోని 60డివిజన్లలో విస్తృతంగా కార్యక్రమం నిర్వహించేందుకు కేఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. నివాసాల సమీప ప్రాంతాలు పారిశుద్యం, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగింపు కూలర్లు, డబ్బాలు తొలగింపు, నిల్వ ఉన్న నీరును తొలగించటం, ప్రజల్ని స్వచ్ఛందంగా శ్రమదానంకు అవగాహన కల్పించటం వంటి కార్యక్రమాలు చేపడ్తారు. ఇందుకోసం రోజు వారీగా ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించారు. డివిజన్ల వారీగా ప్రత్యేక అధికారులను కేటాయించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తల్లాడ,ఆగస్టు4: మండల పరిధిలోని అన్నారుగూడెం ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా సోమవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎన్‌పీడీసీఎల్ తల్లాడ ఏఈ రాజేష్ తెలిపారు. గోపాలపేట, నర్సింహారావుపేట, అన్నారుగూడెం, లక్ష్మీనగర్ గ్రామాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

దొడ్డి కొమరయ్య చిత్ర నిర్మాణ కమిటీ ఎన్నిక

ఖమ్మంచర్చికాంపౌండ్, ఆగస్టు4: దొడ్డి కొమరయ్య చిత్ర నిర్మాణ కమిటీ జిల్లా చైర్మన్‌గా షేక్‌అబ్దుల్‌రహమాన్ నియమిస్తూ రాష్ట్రకమిటీ ప్రకటించింది. ఆదివారం హైదరాబాదులోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞన భవనంలో జరిగిన దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సినిమా నిర్మాణానికి సహకరిస్తున్న పలువురికి రాష్ట్ర అధ్యక్షుడు, చిత్రదర్శకులు మహలంక సేనాపతి కృతజ్ఞతలు తెలిపారు.

ఏజెన్సీ ప్రాంత రైతుకు రుణమాఫీ ఇవ్వాలి

కామేపల్లి, ఆగస్ట్ 4: ఏజెన్సీ ప్రాంతంలోని ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ అందాలని డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ధరణి పోర్టల్ రాకముందు అడంగల్ పహణీల ఆధారంగా వివిధ బ్యాంక్‌లలో పంట రుణాలు తీసుకున్న ప్రతీ ఒక్క రైతుకు రుణ మాఫీ చేయాలని అన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

తిరుమలాయపాలెం,ఆగస్టు4: ఎటువంటి షరతులు లేకుండా రైతులందరికి రుణమాఫీ చేయాలని టీడీపీజిల్లానాయకులు కొండబాల కరుణాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం తిరుమలాయపాలెంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఆరుగ్యారంటీలను పూర్తిగా అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలోమండల అధ్యక్షుడు నామా ప్రసాద్, కొప్పుల వెంకటరావు, మల్లీడి భాగ్యమ్మ, మల్లీడి రమేష్, నాగన్న, పాల్గొన్నారు.

నేడు వైరాలో ప్రజావాణి

వైరా,ఆగస్టు4: వైరారెవెన్యూ కార్యాలయంలో ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తహసీల్దార్ కేవీ. శ్రీనివాసరావు తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలను ఈ ప్రజావాణిలో తమకు విన్నవించుకోవచ్చునని పేర్కొన్నారు. ఇకమీదట కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే అవసరం లేదన్నారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తుమ్మలకు సన్మానం

ఖమ్మం సంక్షేమ విభాగం: ఎస్సీ వర్గీకరణకు సహకరించినందుకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కాంగ్రెస్ జిల్లా నాయకులు కాంపాటి వెంకన్న సన్మానించారు. ఆదివారం ఖమ్మంలో తుమ్మలను కలిసిన కాంపాటి ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

పలువురిని పరామర్శించిన మువ్వా

సత్తుపల్లిరూరల్, ఆగస్టు4: రాష్ట్రనీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయబాబు ఆదివారం సత్తుపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా గుడిపాడు రోడ్డులోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆయన్ను సన్మానించింది. అనంతరం పలువురిని పరామర్శించిన అనంతరం ఖమ్మం వెళ్లారు.



గుడిపాడు శివాలయంలో పూజలు చేస్తున్న మువ్వా

రంగమ్మకు నివాళులర్పించిన మువ్వా

తల్లాడ: తల్లాడ మండలం నూతనకల్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన తూము రంగమ్మ కుటుంబాన్ని ఆదివారం మువ్వా విజయ్‌బాబు పరామర్శించారు. రంగమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగమ్మ కుమారులు గంగదేవిపాడు సొసైటీ చైర్మన్ తూము వీరభద్రరావు, మాజీ సర్పంచ్ తూము శ్రీనివాసరావును పరామర్శించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకుడు గణేశుల రవి, ప్రముఖ న్యాయవాది ఇమ్మడి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ యువజన నాయకుడికి...

కల్లూరు: కల్లూరులో ఇటీవల అనారోగ్యానికి గురియైన యువజన కాంగ్రెస్ నాయకుడు కాటేపల్లి కిరణ్‌ను ఆదివారం మువ్వా విజయబాబు పరామర్శించారు. హైదరాబాద్‌లో చికిత్స పొంది ఇటీవల ఆయన ఇంటికి రాగా, మువ్వా పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మట్టూరి జనార్థన్, మత్తే గోపాల్, చిరుమామిళ్ల రామకృష్ణ మానస నాని, కోత్తూరు కోటేశ్వరరావు, సాయిని లక్ష్మణరావు, నర్సింహారావు నాగరాజు, ఉపేదర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

ఖమ్మంసాంస్కృతికం, ఆగస్టు4: స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వరమాలిక కల్చరల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహిచిన సంగీత విభావరి సంగీతాభిమానులను అలరించింది. స్నేహం కోసం అనే పేరుతో నిర్వహించిన సంగీత విభావరిలో పలు చిత్రాల్లోని స్నేహగీతాలను ఆలపించారు. మన్నేపల్లి మల్లికార్జున్ ఆధ్వర్యంలో గాయనీ గాయకులు శ్రీదేవి, కృష్ణ శబరి, నాగస్వర్ణశ్రీ, శివలీల, ఎస్‌వీ రమణ, ఎండీ జాఫర్, మోహన్ కృష్ణ, పాటలు పాడారు. జి.రవీందర్, పీవీనటరాజ్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.

విద్యుత్ అధికారుల పొలంబాట



చింతకాని, ఆగస్టు4: విద్యుత్ సమస్యలను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించేందుకు విద్యుత్ అధికారుల పొలంబాటలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని రామకృష్ణాపురంలోని వ్యవసాయ క్షేత్రాల్లో ఎస్ఈ సురేందర్ సిబ్బందితో పర్యటించారు. 11 కేవీతో, ఎల్‌టీ విద్యుత్‌లైన్లను పరిశీలించారు. వర్షాకాలంలో వ్యవసాయ విద్యుత్ మోటార్ల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వంగిపోయిన స్తంభాలు, వేలాడుతున్న తీగలను పరిశీలించి మరమ్మతులు నిర్వహించారు. విద్యుత్ సమస్యలు ఉంటే రైతులు వెంటనే అధికారుల దృష్టికి తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో డీఈ నంబూరి రామారావు, ఏడీఈ తిలక్, ఏఈ వెంకన్న, లైన్‌మెన్‌లు కిషన్, విజయ్, రైతులు కన్నెబోయిన సీతరామయ్య, తిరుపతి గోవింద రావు, తూము కోటయ్య, తూము అంజయ్య, కన్నెబోయిన కొండలరావు, అంజయ్య, గాదె మోహన్‌రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనపై అనుచిత వాఖ్యలు తగవు

కల్లూరు,ఆగష్టు4: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రతిపక్ష నాయకులు అనుచిత వాఖ్యలు చేయటం తగదని మండల కాంగ్రె స్ నాయకులు తీవ్రవంగా ఖండించారు. ఆదివారం కల్లూరులో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాగం నీరజదేవి, పసుమర్తి చందర్‌రావు తదితర నాయకులు మాట్లాడారు. గత బీఆర్ఎస్ పాలనలో దోచుకోవటమే కాని అభివృద్ధి శూన్యమన్నారు. రైతాంగం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ అందుకు విరుద్ధంగా కల్లూరులో ఇటీవల ఓ మాజీ ప్రజా ప్రతినిధి ఇంకా అధికార దర్పం ప్రదర్శిస్తూ తమ ప్రభుతాన్ని విమర్శించట విడ్డురంగా ఉందన్నారు. సీఎంకేసీఆర్ నియంత పాలన సాగించారని, నేడు కాంగ్రెస్ పాలన ప్రజారంజకంగా సాగుతుందన్నారు. కాంగ్రెస్ పాలనలోనే అన్ని విధాలుగా సంక్షమా పథకాలు అందుతున్నాయని అన్నారు. ఈ సమావేశంలో ఎస్‌కే యాఖుబ్‌అలీ,బాగం ప్రభాకరచౌదరి, ఏనుగు సత్యంబాబు, పుల్లారావు, ఎస్‌కే ఉస్మాన్, తురాబ్‌అలీ, భుక్యా శివకుమార్‌నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఘనంగా స్నేహితుల దినోత్సవం


మధిర, ఆగస్టు 4: స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం మధిరలో పలు సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. మధిర సేవా సమితి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు స్నేహితులకు బ్యాడ్జీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. స్విమ్మర్స్ క్లబ్, వాకర్స్‌క్లబ్ సభ్యులు స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

ఖమ్మంరూరల్: ప్రజలు సహకరిస్తే నేరాలు అధిక శాతం అరికట్టవచ్చని, ఖమ్మంరూరల్ సీఐ రాజిరెడ్డి అన్నారు. డీవైఎఫ్ఐ ఖమ్మంరూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రూరల్ పోలీస్ స్టేషన్‌లో వేడుకలు నిర్వహించారు. డీవైఎఫ్ఐ యువకులు సీఐ రాజిరెడ్డికి ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

ముదిగొండ: ముదిగొండలోని మచ్చావీరయ్య భవన్‌లో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవ సంబరాలు నిర్వహించారు. స్నేహితులందరూ ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టుకొని శుభాకాంక్షలు కూడా తెలుపుకున్నారు. కార్యక్రమంలో బట్టు రాజు, మెట్టెల సతీష్, స్వరాజ్, ఇరుకు నాగేశ్వరరావు, లక్ష్మణ్, రవి, సురేష్, నాగేశ్వరరావు, నాగార్జున, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పలువురికి కాంగ్రెస్ నాయకుడు దయానంద్ పరామర్శ

కల్లూరు, ఆగస్టు4: కల్లూరులో ఇటీవల అనారోగ్యానికి గురైన పలువురు బాధితులను కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్ ఆదివారం పరామర్శించారు. కల్లూరు కాంగ్రెస్ నాయకుడు దార రంగా కుమారుడైన రాజీవ్, కాంగ్రెస్ నాయకులు ఉబ్బన గోపాలస్వామి, పాపబత్తిని నగేష్ అన్యారోగ్యానికి గురయ్యారు. సమాచారం అందుకున్న దయానంద్ వారి నివాస గృహాలకు వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై వాకాబు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, బాగం ప్రభాకర చౌదరి, ఎస్‌కే ఉస్మాన్, భుక్యా శివకుమార్ నాయక్ తురాబ్‌అలీ పాల్గొన్నారు.



రాజీవ్‌ను పరామర్శింస్తున్న కాంగ్రెస్ నాయకుడు దయానంద్

స్వచ్ఛదనం-పచ్ఛదనం విజయవంతం చేయాలి

మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్

సత్తుపల్లి, ఆగస్టు4: నేటినుంచి 9వరకు సత్తుపల్లి పట్టణంతో పాటు మండలంలో స్వచ్ఛదనం- పచ్ఛదనం అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే పలు సమావేశాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో చైర్మన్ కూసంపూడి మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన మేరకు స్పష్టమైన ప్రణాళికతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రోజూ శానిటేషన్, ప్లాంటేషన్ కార్యక్రమాలు జరగాలని, ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్ల వంటి వాటిని మనం వాడకుండా మిగిలిన వారందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో కమీషనర్ మందా రవిబాబు, మునిసిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ మహేష్

డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొట్టాలి

ఖమ్మంసాంస్కృతికం, ఆగస్టు4: డ్రగ్స్ మహమ్మారిని సమాజం నుంచి తరిమి కొట్టటం అందరిబాధ్యతఅని ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్ మెంట్ సీఐ సుంకరి రమేష్ అన్నారు. ఆదివారం ఖమ్మంలోని రిక్కాబజార్ హైస్కూల్‌లో డ్రగ్స్‌వ్యతిరేక కవి సమ్మేళనం నిర్వహించారు. అక్షరాల తోవ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డ్రగ్స్ దుష్పలితాలపై ప్రజలు చైతన్య పరిచేందుకు కవులు కలంబూనటం హర్షణీయం అన్నారు. కార్యక్రమంలో అక్షరాలతోవ నిర్వాహకులు నామా పురుషోత్తం, దాసరోజు శ్రీనివాస్, రాచమళ్ల ఉపేందర్, కవులు కన్నెగంటి వెంకటయ్య, సీత్లానాయక్, ఇబ్రహీం నిర్గున్, పంజాల ఐలయ్య, దేవయ్య, గాజుల భారతి, మద్దినేని జ్యోతి పాల్గొన్నారు.

పేరువంచ టీచర్‌ను విధుల్లోకి తీసుకోవాలి

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు3: పేరువంచ ఆంగ్ల ఉపాధ్యాయురాలిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆదివారం డీఈవో సోమశేఖర శర్మకకు ఎస్‌టీఎఫ్ రాష్ట్రప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఇటీవల పాఠశాల విద్యార్థుల క్రమశిక్షణలో బాగంగా చేపట్టిన చర్యలకుగాను సస్పెండ్ అయిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పేరువంచ ఆంగ్ల ఉపాధ్యాయురాలు శిరీషను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. క్రమశిక్షణలో భాగంగానే ఉపాధ్యాయురాలు అలా చేయాల్సి వచ్చిందన్నారు. తక్షణం విధుల్లోకి తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు యాదగిరి, మన్సూర్ కరీముల్లా, శిరీష తదితరులు పాల్గొన్నారు.

నేడు దోస్త్ రిజిస్ట్రేషన్‌కు చివరి రోజు

ఖమ్మంఖానాపురంహవేలి,ఆగస్టు3: డిగ్రీప్రథమ సంవత్సరంలో చేరటానికి సోమవారం దోస్త్ ప్రత్యేక విడతకు చివరి రోజని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ మమొహ్మద్ జాకిరుల్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.400 అదనపు రుసుంతో రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉందని తెలిపారు. ఈ నెల 7న సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు.

ఎలక్ట్రికల్ స్కూటీ దగ్ధం

ముదిగొండ,ఆగస్టు4:మండల పరిధిలోని సువర్ణాపురంలో శనివారం అర్ధ రాత్రి ఎలక్ట్రికల్ స్కూటీ దగ్ధమైంది. వేల్పుల వెంకట రామారావు స్కూటీకి చార్జింగ్‌పెట్టగా అర్ధరాత్రి విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి.

వైద్య శిబిరం విజయవంతం

ఖమ్మంరూరల్ ఆగస్టు 4: మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్ వద్దగల తమ్మినేని సుబ్బయ్య భవన్లో ప్రతీనెల మొదటి ఆదివారం తమ్మినేని సుబ్బయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం ఆదివారం విజయవంతమైంది. ఈ సందర్భంగా బీపీ, షుగర్ మందులు కేవలం 100 రూపాలయలకే నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈ శిబిరంలో ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ చీకటి భారవి, వైద్యులు పి. సుబ్బారావు, పొన్నం వెంకటరమణ, రంజాన్‌పాపా రోగులను పరీక్షించారు. క్యాంపు ఆర్గనైజర్ ఉరడీ సుదర్శన్‌రెడ్డి, వాలంటీర్లు నందిగామ కృష్ణ, ఇంటూరి అశోక్, నాగరాజు, శ్రీనివాసరావు, రమేష్ తదితరులు వైద్యశిబిరంలో సేవలందించారు.